
కొత్తపల్లి

పిల్లల కథల పుస్తకం



65

కొత్తపల్లి పిల్లల కథల పుస్తకం-65 ఫిబ్రవరి 2014

మూలం: http://kottapalli.in/2014/02/welcome

ఏపని- ఎవరిది:

ప్రచురణ: కొత్తపల్లి ప్రచురణలు, చెన్నేకొత్తపల్లి

నిర్వహణ: సత్యఫౌండేషన్, చెన్నూరు.

ప్రధానసంపాదకులు: నారాయణ

సహసంపాదకత్వం: మంజునాథ్

చిత్రాలు: వీరాంజనేయులు, అడవిరాముడు

సాంకేతికసహకారం: ఆనంద్, లక్ష్మి

వాణిజ్యం: మల్లికార్జున

గౌరవసలహాదారు: సుబ్బరాజు

అక్షరకూర్పు: కొత్తపల్లి

అలంకరణ: యాక్‌తూ ఫైన్ఆర్ట్స్ స్టుడియో, హైదరాబాదు. ఫోను: 04042206233

ముద్రణ: ముద్రికా ఆఫ్‌సెట్‌ప్రింటర్స్, విజయవాడ ఫోను: 08662579129

స్వాగతం!

కొత్తపల్లిలో పిల్లల రచనలకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ పుస్తకంలో దాదాపు సగం కథలు పిల్లలు రాసినవి; మిగిలినవి పిల్లలకోసం పెద్దలు రాసినవి. బొమ్మలు వేసిన వాళ్ళు మటుకు యువకులు.

పిల్లలను కలవటం, వాళ్లతో తెలుగులో కథలు రాయించటం, బొమ్మలు వేయించటం, వాళ్ళు పంపిన కథల్ని, బొమ్మల్ని సరిదిద్ది మిగతా పిల్లలందరికీ నచ్చేట్లు పుస్తకాలుగా తయారు చేయటం, దానికోసం ఓపెన్ సోర్సు ఉపకరణాలను వాడటం, కథల్ని అందరూ ఉచితంగా చదువుకునేట్లు ఇంటర్నెట్‌లో పెట్టటంతోపాటు, కొన్ని ప్రతులు అచ్చువేయటం మాకు ఇష్టం. అందరి మేలూ కోరి చేసే ఈ పనిలో మీరూ పాలుపంచుకోండి. పిల్లల కథల ప్రపంచానికి స్వాగతం!

వెలల పట్టిక:

	వ్యక్తులు	సంస్థలు
విడి ప్రతి వెల (పోస్టేజీ అదనం)	25 రూ.	30 రూ.
12 ప్రతులు (పోస్టేజితో సహా)	300 రూ.	350 రూ.

రానున్న 12 ప్రతులకోసం 300 రూ.లను మనిఆర్డరు/బ్యాంకు ట్రాన్సుఫరు ద్వారా చెల్లించండి. పుస్తకాలను పోస్టులో పంపుతాం, మీ రచనలను పోస్టు/ఇమెయిలు రూపంలో పంపండి. బాగున్నవాటిని తప్పక ప్రచురిస్తాం!

బ్యాంకు ట్రాన్సుఫరు కోసం అక్కౌంటు వివరాలు:

Kottapalli Prachuranalu,
S.B. A/c No: 62320333310
SBH- Dharmavaram Branch,
ISFC code: SBHY0020902

కొత్తపల్లి ప్రచురణలు

1-127/A, యం ఆర్ వో ఆఫీసు దగ్గర,

చెన్నేకొత్తపల్లి- 515101

అనంతపురం జిల్లా

ఫోను: 7702877670 ఇ-మెయిలు: team@kottapalli.in

వెబ్‌సైటు: http://kottapalli.in



విషయ సూచిక

చలి చొక్కా

ఓసారి ఏమైందంటే, గంగరాజుకి బాగా చలి పుట్టింది. చలికాలం కదా, అందుకని. అయితే వాడి దగ్గర చలిచొక్కా లేదు. పాపం వాళ్ళమ్మ ఒక్కత్తే ఎంతకని కష్టపడుతుంది? అందుకని వాడు తన చలి గురించి ఆమెకి చెప్పనేలేదు- అట్లానే ఓర్చుకున్నాడు.

అయితే ఆరోజు బడికి రత్నాలవారి అబ్బాయి భూపతి గొప్ప చలిచొక్కా ఒకటి వేసుకొని వచ్చాడు.లావుగా, మెత్తగా, చక్కగా మెరిసిపోతూ- భలే ఉందది. దాన్ని చూసినవాళ్లందరికీ ఎండపొద్దునకూడా చలి పుట్టింది, ఆరోజున.

"ఒరే, ఒక్కసారి వేసుకోనియ్యిరా!" అని వాడిని అడుక్కున్నారు అందరూ. "మా అమ్మ ఎవ్వరినీ వేసుకోనివ్వద్దందిరా" అని పోజు కొట్టాడు వాడు. అమ్మ మాటని ఏనాడూ కాదనని కొడుకు మాదిరి మొకం కూడా పెట్టాడు.

ఆ రోజంతా గంగరాజు భూపతి తోకల్లే తిరిగాడు. అయితే ఎంత రాసుకొని పూసుకొని తిరిగినా భూపతి మాత్రం ఒక్కసారంటే ఒక్కసారన్నా చలిచొక్కా ఇవ్వలేదు. సాయంత్రం బడిగంట అవ్వగానే గంగరాజు భూపతి వెంట పోయాడు: "ఇంటికెళ్ళినాక చలిచొక్కా విప్పుతాడు కదా, అప్పుడైనా వేసుకోనిస్తాడేమో" అని.

ఉహుఁ..లాభం లేదు. చొక్కా మార్చుకునేందుకు లోపలికి వెళ్ళిన భూపతి ఇంక బయటికి రానే లేదు. గంగరాజుకి చాలా బాధైంది. నిజంగానే తనకూ ఓ చలిచొక్కా కొనిపెట్టమని అడిగెయ్యాలనుకున్నాడు అమ్మని. గబగబా ఇంటికి పరుగు పెట్టాడు.

అయితే వాడు వెళ్ళేసరికి అమ్మ ఇంటి బయట పాత్రలు తోముతోంది- "ఒరేఁ గంగీ! ఓ సారి పొయ్యికి కట్టెలు ఎగెయ్యిరా! అట్లానే కూర కలబెట్టు, గంటెతో" అని అరిచింది, బయటినుండే.

గంగిరాజు పుస్తకాల సంచీని ఇంట్లో మూలకి విసిరేసి, పొయ్యి దగ్గరికి వెళ్ళాడు-



ఆశ్చర్యం! పొయ్యి దగ్గరంతా ఎంత వెచ్చగా ఉందో! భలే ఉంది. పొయ్యిలోకి కట్టెలు ఎగేస్తూంటే చేతులంతా హాయిమన్నాయి. కూర కలబెడుతూ గంటె పట్టుకుంటే- ఇంక అక్కడినుండి లేవబుద్ధి కాలేదు.

"రేయ్! లెగు. పొయ్యి దగ్గర కూచొని ఏం చేస్తా ఉండావు?" అంటూ లోపలికి వచ్చిన అమ్మ, చలి కాగుతున్న కొడుకుని సూటిగా చూసి "పొయ్యి దగ్గర కూకొని చలి కాగుతుండావా, సాయంకాలం పూటనే?! రేప్పొద్దున్న సంతలో ఓ చలిచొక్కా కొనుక్కొస్తాలే, నీకంత చలైతే!" అంది.

"ఏం వొద్దులే, అమ్మా! మాపటేలా, పొద్దున్నా మంట వేసుకుంటే ఎంత చలైనా పారిపోతుందిలే. ఇంక చలిచొక్కా దేనికి, ఊరికెనే?!" అన్నాడు గంగిరాజు, పొయ్యికి మరింత దగ్గరగా జరుగుతూ.

రకరకాలుగా వణుకుతూ కొంకర్లు పోతున్న మన సమాజానికి ఇప్పుడు కొంచెం వేడి తగిలితే- భలే ఉంటుంది వెచ్చగా! అలాంటి వేడి వేడి కథలు రెండు మూడు వచ్చాయి ఈ పుస్తకంలో. మరి వెచ్చదనపు ఆ రుచి ఎలా ఉందో- మీరే చెప్పాలి! చెబుతారుగా..?

అందరికీ వెచ్చని చలిమంటల శుభాకాంక్షలతో,

కొత్తపల్లి బృందం.



నీతి చంద్రిక

విగ్రహం-22

జరిగిన కథ: హంసరాజు సైన్యం అంతా కోటలోంచి బయటికి వెళ్ళి నెమలి సైన్యంతో తలపడింది. ఆ సమయంలో మండుతున్న పుల్లను ఒకదాన్ని ముక్కున కరచుకొని, కాకి రహస్యంగా కోటలోకి జొరబడింది... ఇక చదవండి, నీతిచంద్రిక- 46 వ భాగం.

మూలం. కీ.శే. కందుకూరి వీరేశలింగం *సరళీకరణ: ఘుడియారం వేంకట నారాయణ శర్మ*

మండే పుల్లను ముక్కున కరచుకొని దొంగతనంగా కోటలోనికి చొరబడిన ఆ కాకి వెన్నంటే, దాని అనుచరులైన కాకులు ఒక వెయ్యి అమిత వేగంగా గుహలోనికి ఎగిరివచ్చాయి. అవన్నీ కలిసి త్వరలోనే కోటలో ఉన్న ప్రతి ఇంట్లోనూ మంటలు రగిల్చాయి. అన్నీ తమ తమ రెక్కలతో విసిరే సరికి, ఆ మంటలు చెలరేగినై; హంసరాజు అనుచరులు గమనించే సరికే ఆ మంటలు కోటను పూర్తిగా ఆక్రమించినై.

అప్పుడు పైకెగసిన మంటకు, పొగకు భయపడి కోటలో ఉన్న పక్షులు పైకి ఎగిర

చూశాయి. కానీ మంటల వేడికి రెక్కలు కమిలిపోయేసరికి అవన్నీ గింగిరాలు తిరుగుతూ క్రింద పడిపోయి, ఎగసి పడుతున్న అగ్ని కీలలకు ఆహుతి అయిపోయాయి.



ప్రళయ సమానంగా పెచ్చరిల్లుతున్న మంటలకు అదిరిపోయి, చావగా మిగిలిన పక్షులు ఏదో ఒక విధంగా తప్పించుకొని ఆకాశానికి ఎగరగానే, వాటిని దూరంగా పోనివ్వక, కాకులు వాటికి అడ్డునిలచి, తమ వాడి ముక్కులతో పొడిచి, కాళ్ళతో రక్కి, తమకు ఇక అడ్డు లేకుండా ఆ పక్షి సమూహాలను అంతం చేసేశాయి.

అటుపైన ఆ కాకులన్నీ ఏకకంఠంతో "కోట పట్టుబడింది! కోట పట్టుబడింది!" అని అరిచాయి. ఆ కోలాహలం ఆకాశం అంతటా నిండి ప్రతిధ్వనించేసరికి, కోటలోని పక్షులన్నీ ఆ మంటలు తెచ్చిన ఉత్పాతానికి భయపడి, గట్టిగా ఏడవసాగాయి. వాటిలో కొన్ని ధైర్యం చేసి, మంటలకు ఎదురు ఎగసి, దూరంగా పారిపోయి, ప్రాణాలను అరచేత పట్టుకొని నీళ్లలోకి దూకి, అట్లా అతి కష్టం మీద తమ ప్రాణాలను దక్కించుకున్నాయి.

మరికొన్ని పక్షులు- తమ సహజ స్వభావానికి భయం కూడా తోడయి గుండెలు ఝల్లుమనేసరికి, కళ్ళు తిరిగేసరికి, ఎగిరేందుకు ఇక రెక్కలు రాక, శత్రువుల కాలిగోళ్ళ దెబ్బలకు తట్టుకోలేక, రక్తపుటేర్లు ప్రవహిస్తున్న కొండల మాదిరి క్రిందపడి, చేష్టలు ఉడిగి, ఏం చేయాలో అర్థం కానట్లు మ్రాన్పడిపోయాయి. మంటలు అట్లాంటి పక్షులను నలువైపులనుండీ క్రమ్ముకుంటూ పోయాయి.

ఆ విధంగా క్షణకాలంలో కోట యావత్తూ

చీడపురుగు తాకిడికి గురైన పొలం మాదిరి నిరుపయోగం అయ్యేసరికి, బయట యుద్ధం చేస్తున్న పక్షులలో కూడా కలవరం మొదలైంది; కాలు-చెయ్యి ఆడలేదు.



మీద పిడుగు పడ్డట్లు అవన్నీ విచారంతో నీరసించి పోయాయి. అన్నీ అట్లా ఏమరుపాటుతో ఉండగానే వాటిని చుట్టుముట్టిన శత్రుమూకలు వాటిని వాడి ముక్కులతో పొడిచి గాయపరచటం, రెక్కలతో దఢాలున మోదటం మొదలుపెట్టాయి.

వాటి ధాటికి తాళలేని పక్షులు చాలా ప్రాణాలు పోగొట్టుకొని నేలమీద పడిపోయాయి. పిరికి పక్షులు కొన్ని రాజును శత్రు మధ్యంలోనే విడచిపెట్టి, నిలబడ్డ చోట నిలబడక, చూసిన వైపుకు చూడక, దూరదూరాలకు ఉరికి, ఒకటి పోయిన వైపుకు ఒకటి పోనట్లు చెల్లాచెదరై, చెట్టుకొకటిగా పారిపోయాయి.

వాటిమాదిరి పారిపోలేని పక్షులు కొన్ని వెనకబడి, శత్రుమూకల చేతికి చిక్కిపోయినై. శత్రువుల దెబ్బలకు, తన్నులకు, ముక్కు పొడుపులకు తాళలేక, ఎముకలు విరిగిపోగా అసువులు బాసాయి.

ఇట్లా నాశనం అవుతున్న తన సైన్యాలు శత్రువుల ధాటికి నిలువలేక చెల్లాచెదరైపోగా, ఆ విపత్సమయంలో రాజహంస, సహజంగానే మెల్లగా నడిచేది గనక, ఇక పారిపోలేనని నిశ్చయించుకున్నది. ఆ సమయంలో దాని వెంట సేనాపతి 'బెగ్గురు పక్షి' మాత్రం ఉన్నది.

పొరలి పొరలి వచ్చే కన్నీరు వరదలు కాగా రాజహంస సేనాపతివైపుకు తిరిగి "ఓ వీర యోధుడా! చూశావు కదా, నా మూలంగా

మనవాళ్ళు ఎందరికి ఇట్లా ప్రాణాంతకమైన ఆపద ఎదురైందో?! వీళ్లందరి శౌర్యాన్ని గురించీ ఇకమీదట జనాలు కథలు కథలుగా చెప్పుకుంటారన్నమాట!



ఈ క్షణంలో అయితే నువ్వూ, నేనూ ఇద్దరం ఊపిరితో ఉన్నాం. రానున్న క్షణంలో ఎవరం ఏమి అవుతామో తెలీదు. నన్ను కాపాడటం కోసం అంత గొప్ప యోధులే నశించారే- ఇక నా యీ పాడు శరీరం నన్ను ఏం కాపాడగల్గుతుంది?

ఆ నీలవర్ణుడిని నమ్మటం వల్లనేగదా, పరిస్థితి ఇలా అయ్యింది?! వాడి మాయమాటలు విని, వాడు 'విశ్వసనీయుడు' అని భ్రమపడి, తప్పు చేసి ఈ గతిని తెచ్చుకున్నాను. ఆ దుర్మార్గుడు నమ్మించి ఇప్పుడు మోసం చేశాడు. 'ఇతన్ని దగ్గరికి రానివ్వద్దు' అని ఆనాడు మీరంతా ఎన్నెన్ని విధాలుగానో చెప్పారు. ఏమి కాలకర్మ దోషమోగాని, ఆ మాటలేవీ అప్పుడు నా చెవులకు రుచించలేదు. అప్పటి నా మనో ప్రవృత్తి ఎలా ఉండిందని చూస్తే ఇప్పుడు నాకు నాకే ఆశ్చర్యం అవుతున్నది. కాలం మూడినవాడికి మంచి మాటలు ఎలా రుచిస్తాయి? 'వద్దు-వద్దు' అని మీరంతా చెవిన ఇల్లు కట్టుకొని పోరినా వినకపోతినే?! ఆ పాపఫలం అనుభవించక తప్పుతుందా?

అయినా దేవుడి సంకల్పం ఇలా ఉంటే మన పౌరుషం ఏం పనికివస్తుంది? అయ్యో! దేవుడు ఇలా ఎందుకు చేశాడు?! వెయ్యిమంది అనుక్షణం కొలుస్తుండగా ఒకనాడు వెలిగిపోయిన నన్ను, ఈనాడు పిలిచినా 'ఓ' అనేవాడు లేకుండా చేశాడే! మనవాళ్లంతా ముందుగానే దోవ తీశారు; క్షణం ఎక్కువ-తక్కువగా మనం కూడా అదే

దారిన వారిని చేరబోతున్నాం. మన సర్వజ్ఞుడు ఆనాడు చెప్పిన మాటలన్నీ ఈనాడు నిజం అయ్యాయి. మరి అతను కూడా మనవాడే- అతని గురించి ఇంకా ఏమీ తెలియరాలేదు- ఏ దుర్వార్త వినాల్సి వస్తుందో అని భయంగా ఉంది.



'సేనానీ! నువ్వు మంచివాడివైతే ఓ సాయం చెయ్యి. దైవంచేత శపించబడినవాడిని నేను- అట్లాంటి నన్ను రక్షించాలనుకునే నీ ప్రయత్నం ఎట్లాగూ సఫలం కాదు. అందుకని ఇవాల్టితో నా మీద ఆశ వదిలెయ్యి. నా యీ చివరి కోరికకు మోకాలడ్డక, ఈ ఒక్క కోరికనూ తీర్చి పుణ్యం కట్టుకో- నువ్వు తక్షణం ఇంటికి వెళ్ళి, సర్వజ్ఞుడి అనుమతితో నాకొడుకు చూడాకర్ణుడిని పక్షి రాజ్యానికి అధిపతిగా నియమించి, పట్టాభిషేకం చెయ్యి. ఆపైన ఆ శుభవార్తను తెచ్చి కాస్త నా చెవిన వేస్తే సంతోషంగా ప్రాణాలు విడుస్తాను. చూడాకర్ణుడైనా ప్రాణాలతో ఉండి వర్ధిల్లితే, ఏనాటికైనా మన యీ పగను చల్లార్చగలడు. దైవం మనల్నిద్దరినీ చల్లగా చూసిందనుకో, అప్పుడు మళ్ళీ కలుస్తాం. లేదంటే 'ఇంతే మన అదృష్టం- ఇదే కడసారి చూపు' అనుకుందాం" అంది.

హంస మాటలు సేనాపతి చెవుల్లో శూలాల మాదిరి గుచ్చుకొని, దాని హృదయాన్ని కలచివేశాయి. అది కొంతసేపు నిర్ఘాంతపోయి, తెలివి తెచ్చుకొని, కళ్ళనీరు నిండగా గద్గద స్వరంతో "ప్రభూ, వినరాని ఇటువంటి మాటలు తమ నోట రారాదు. చూడాకర్ణుడికి పట్టం కట్టమని ఎంతమాట అన్నారు! ఆకాశంలో చంద్రుడు, నక్షత్రాలు ఉన్నంతకాలం ఈ భూవలయాన్ని మొత్తాన్నీ తమరే ఏలుదురుగాక. నేను సేనానిగా

జీవించి ఉండగా తమరిని ఎవరే కానీ వ్రేలెత్తి చూపగలరా? వేయి మాటలు ఎందుకు? నా రక్తమాంసాలతో నిండిన మార్గాన తప్ప ప్రభువులవారు ఈ రణరంగంనుండి వెనుకకు మరలరాదు. ఓపికగలవాడు, దాత, సుగుణములను పెంచేవాడు అయిన యజమాని దొరకడం కేవలం అదృష్టం. శుభ్రత, దక్షత, ఇష్టం అనే మూడూ కలిగిన అనుచరుడు దొరకటం కూడా దుర్లభమే. ఆ విధంగా అదృష్టంకొద్దీ లభించిన ప్రభువు అనే రత్నాన్ని పోగొట్టుకునేంత తెలివితక్కువవాడు ఉంటాడా? నాకు తమరి తోడిదే లోకం. తమరిని ఎడబాసి క్షణంకూడా ఉండలేను...

(ఇంకా ఏమన్నదో వచ్చేసారి...) ★

నవ్వండి!

ఏదయితేనేం?

భార్య: బీరకాయలు తెమ్మంటే టెంకాయలు తెచ్చారేంటీ?

వెంగళప్ప: నిన్న డాక్టర్ దగ్గరికెళ్ళినప్పుడు పీచు బాగా ఉన్న కూరలు తినమన్నాడుగా...!

అప్రయత్నం

గిరి: మనకెప్పుడూ ఓటమి రాకూడదంటే ఎం చేయాలి?

హరి: అసలు ప్రయత్నమే చేయొద్దు...!

ఏకేస్?!

రవి: అరే! మొన్న నేను ఊరికి వెళ్ళినప్పుడు నామీద పెద్ద కేస్ పడిందిరా!

సోము: ఏం కేస్ రా?

రవి: సూట్కేస్ రా!



గుమ్మడి కాయ దయ్యం

రచన: ఐదవతరగతి పిల్లలు, యంపిపి స్కూలు, గొల్లపల్లి, అనంతపురం జిల్లా.

అనగనగా ఒక ఊళ్ళో రంగయ్య, పుల్లయ్య అని ఇద్దరు స్నేహితులు ఉండేవాళ్ళు. వాళ్ళు ఒకరోజున ఆడుకోటానికి వెళ్తూ ఉంటే దారిలో వాళ్లకొక వింత గుమ్మడి కాయ కనిపించింది: దానికి కళ్ళు, ముక్కు, చెవులు, నోరు ఉన్నాయి! వాళ్లలో రంగయ్యకు భయం ఎక్కువ. పుల్లయ్య మటుకు ధైర్యవంతుడు. పుల్లయ్య గబుక్కున ముందుకు వంగి ఆ గుమ్మడికాయను ముట్టుకోబోయాడు.

వెంటనే రంగయ్య వాడిని ఆపి- "ఒరే, ఇదేదో మాయ గుమ్మడి. లేకపోతే గుమ్మడికి నోరు, కళ్ళు, ముక్కు ఉండటం నువ్వు ఎక్కడైనా చూశావా? బహుశ: ఇందులో ఏదో దయ్యం నివసిస్తూ ఉంటుంది. దాన్ని ముట్టుకోవద్దు- మనంపోదాం, పద" అని పుల్లయ్యను లాక్కొని పోబోయాడు.

అయితే ఆ గుమ్మడికాయ వాళ్లని వదల్లేదు! ఇద్దరూ ఎటు వెళ్తుంటే అది కూడా అట్లాగే దొర్లుకుంటూ వాళ్ల వెంటే పోయింది!!



"రేయ్, పుల్లయ్యా! నువ్వు దాన్ని ముట్టుకున్నట్లున్నావు కదరా, ఇప్పుడు చూడు, ఆ దయ్యం మన వెంటే వస్తున్నది! ముట్టద్దంటే విన్నావా, ఇప్పుడు నాకు చాలా భయంగా ఉందిరా, వేగంగా పరుగు పెట్టరా" అని పుల్లయ్య చేతిని పట్టుకొని లాక్కెళ్ళసాగాడు రంగయ్య. అయితే గుమ్మడి కాయ కూడా అంతే వేగంగా వాళ్ల వెంట పడింది.

పరుగెత్తీ, పరుగెత్తీ అలిసిపోయి ఆగారిద్దరూ. అంతే- దొర్లుకుంటూ వస్తున్న గుమ్మడి కాయ కూడా ఎవరో ఆపేసినట్లు ఆగింది!

అది చూసే సరికి ఇప్పుడు ఇద్దరికీ వణుకు పుట్టుకొచ్చింది. "ఇది నిజంగా దయ్యమేరోయ్" అని అరుస్తూ ఇద్దరూ మట్టి రోడ్డు వెంబడి పరుగు లంకించుకున్నారు. గుమ్మడికాయ కూడా వాళ్ల వెనకనే దొర్లుతూ పోయింది.

చివరికి ఇక చేసేది లేక పుల్లయ్య, రంగయ్య ఇద్దరూ తటాలున చెరొక చెట్టునూ ఎక్కి కూర్చున్నారు. గుమ్మడి కాయ కూడా అంతే వేగంతో ఎగిరి వచ్చి రంగయ్య ఒళ్ళో వాలింది!

రంగయ్య నిలువెల్లా వణికిపోయాడు. "ఓయమ్మో!" అని అరుస్తూ పట్టు వదిలి గబుక్కున చెట్టుమీదినుండి క్రింద పడిపోయాడు. అయితే అదృష్టవశాత్తు ఆ చెట్టు క్రింద ఓ గడ్డివాము ఉండటంతో అతనికి పెద్దగా దెబ్బలు తగల్లేదు. అంతలోనే గుమ్మడికాయకూడా చెట్టు మీదినుండి అతని మీదికి దూకింది! రంగయ్య కంగారుగా

విదిలించుకునేసరికి అది దొర్లి, దగ్గరలో ఉన్న ఓ బండ రాయి మీద పడి పగిలిపోయింది- దానిలోంచి బ్యాటరీతో నడిచే బొమ్మ ఒకటి బయట పడింది.



పుల్లయ్య చెట్టు దిగి వచ్చి దాన్ని నిశితంగా గమనించి చూసాడు- "ఒరే, ఇది దయ్యం కాదురా! ఒట్టి బొమ్మ! మనల్ని భయపెట్టాలని ఎవరో దీన్ని మనమీదికి వదిలారు. శబ్దాన్ని అనుసరించి వెళ్ళేట్లు తయారు చేశారు, దీన్ని ఎవరో- ఎవరో ఏమున్నది, అదిగో- మన 'శాస్త్రవేత్త'- సుధీర్‌గాడు చేసిన పనే ఇది" అన్నాడు, అక్కడికి చేరుకున్న సుధీర్‌ని చూపిస్తూ.

సుధీర్ ఆ బొమ్మని చేతిలోకి తీసుకొని ఇకిలించాడు- "మా చిన్నాన్న విదేశం నుండి చప్పట్లు కొడితే ఎగిరే చిలక బొమ్మని తెచ్చాడురా, దానిలోంచి యంత్రాన్ని తీసి గుమ్మడి కాయలో పెట్టి, ఏమవుతుందో చూద్దామనుకున్నాను; అంతలోనే మీరు కలిసారు- .." అన్నాడు సుధీర్ మరింతగా పళ్ళు ఇకిలిస్తూ. మిత్రులిద్దరూ ముఖాలు ముఖాలు చూసుకొని- "అంటే నిజం దయ్యం నువ్వేనన్నమాట!" అంటూ వాడి మీదికి దూకారు నవ్వుతూ. ★

రోగి: ఎంతప్రయత్నించినా పొగ త్రాగటం మానెయ్యలేకపోతున్నాను డాక్టర్!

డాక్టర్: పర్లేదులేండి! త్వరలో క్యాన్సర్ మందుల ధరలు తగ్గుతున్నాయట...!



ఈనాటి సమాజం

మనందరం కలిసి ఉన్నాం కదా, ఇట్లా కలిసి ఉండాలంటే కొన్ని నియమాలను అందరం పాటించాల్సి వస్తుంది. ఈ విలువలు ఎప్పుడూ ఒకలాగా ఉండవు. ఇప్పుడు మరి మన విలువలు నిజంగా హనీష్ చెబుతున్నంత ఘోరంగా ఉన్నాయా... ఏమో మరి- ఆలోచించాల్సిందే.

రచన: ఎస్.హనీష్, 9 వ తరగతి లిల్లీ, అరవింద హైస్కూల్, కుంచనపల్లి.

అది వెలుగంటే పరిచయం లేని రాత్రి. ఆ అమావాస్య ఉండేది ప్రతీరోజూ...! అంత దట్టమైన అడవి అన్నమాట అది.

ఆ అడవిలో నివసిస్తున్నారు ఒక అడవి జాతి జంట. వాళ్ళ పేర్లు - దేవుల రత్తమ్మ, సీతయ్య. వాళ్ళిద్దరికీ ఒక అందమైన బాబు. వాళ్ళ కలల పంట ఆ బాబు. వాడిని అల్లారుముద్దుగా పెంచుతున్నారు వాళ్లు.

రాత్రనక, పగలనక బాబు అలవకుండా సేవలు, ముద్దుముచ్చట్లు, ఆటలు, పాటలు. ఎన్నెన్ని ఆటలు, పాటలు నేర్పారో ఆ బాబుకు. అడవిలో బాబుకు తెలియని చోటంటూ లేదు, బాబు చూడని జంతువంటూ లేదు. అమ్మా నాన్నలే అతని గురువులైనారు. అడవిలో చుట్టూ ఉన్న చెట్లు, పుట్టలు- ఏవి దేనికి ఉపయోగపడతాయో ఆ బాబుకు నేర్పించారు. ఆనందం, ఏడుపు, జాలి-

అన్నీ (దేనికి, ఎందుకు, ఎలా, ఏమిటి) నేర్పించేసరికి ఆ బాబు పెరిగి పెద్దవాడయ్యాడు.



అబ్బాయి తెలివైనవాడు. మరి వాడు పల్లెకే పరిమితమై ఎందుకు ఉండాలి? దూరంగా ఉన్న పట్టణంలో మంచి ఉద్యోగం సంపాదించుకున్నాడు అతను. రత్తమ్మ, సీతయ్యల సంతోషానికి మేర లేదు.

అటుపైన అబ్బాయికి పెళ్ళి కళ వచ్చిందని మరో పట్టణం పాపను చూసి పెళ్ళి చేశారు గూడెం దొరలంతా.

కాలం గడిచింది. మెల్లగా రత్తమ్మా, సీతయ్య ముసలివాళ్ళయ్యారు.

కొడుకు, కోడలు పట్నంలో కుదురుకున్నారు. సంపాదనలో పడ్డారు. తమదంటూ ఓ కుటుంబం ఏర్పరచుకున్నారు. ముసలివాళ్లను పట్టించుకోవటం మానేశారు.

అలా పల్లెటూరినుండి పట్నానికి వలస పోయిన ఉద్యోగికి చాలాసార్లు తన తల్లితండ్రుల బాధ గుర్తుకొచ్చింది. కానీ అతని ఆలోచనల్లోని డబ్బు అతన్ని తన వైపుకు మళ్ళించుకున్నది.

ఆ తరువాత ఆ తల్లితండ్రులు ఆ అబ్బాయి చిన్నప్పుడు ఊగిన ఉయ్యాల, తిన్న బుల్లి కంచం, అతను పడుకున్న మంచాలను చూసుకుంటూ తుదిశ్వాస విడిచారు.

ఇదీ ఈనాటి సమాజం... ★

అన్ని సామాజికాంశాలకూ మూలం ఆర్థిక సంబంధాలు. సమాజాన్ని నిజంగా శాసించేవి అవే. వాటికున్నంత బలం మరెలాంటి భావజాలానికీ ఉండదు. -కార్ల్ మార్క్స్



ఒక కొత్త ప్రపంచం

గొప్ప వర్ణనలతో పెద్దలకు దీటుగా కిరణ్మయి రాసిన వెచ్చని ఈ కొత్త ప్రపంచపు కథ అసలైతే మహా ఘోర విషాదాంతంగా ఉండింది. మేం దాని అంతం మార్చేసాం... ఇది మీకెలా అనిపించిందో రాయండి.

రచన: ఎ.కిరణ్మయి, తొమ్మిదవ తరగతి లోటస్, అరవింద హైస్కూలు, కుంచనపల్లి, గుంటూరు జిల్లా.

అది ఒక అందమైన పల్లెటూరు. కలతలు, కల్మషాలు లేని ఊరది. అందమైన పచ్చటి పొలాలతో, ఎత్తైన వృక్షసంపదతో, పక్షుల కిలకిలారావాలతో అది భూమి మీదికి దిగిన స్వర్గంలా ఉండేది.

ఆ ఊరిలో ఒక చింపిరి జుట్టు అమ్మాయి- రోజంతా ఎప్పుడూ ఊరి చివరన ఉన్న మర్రి చెట్టు క్రిందే గడుపుతుండేది- మర్రి ఊడలు పట్టుకొని ఊగుతుండేది; అక్కడి ఉడత పిల్లలతో స్నేహం చేస్తూ ఉండేది. ఆ అమ్మాయి కళ్ళలో ఏదో తెలీని సంతోషం ఒకటి చిందులాడుతుండేది. ఆ పాప అక్కడికి వచ్చీ రాగానే ఏవో పాటలు పాడేది. ఆ పాటలు వినగానే చెట్టు మీద ఉన్న పక్షులు, ఉడతలు అన్నీ గబగబా వచ్చి ఆ పాప చుట్టూ చేరేవి. ఏ నాడైనా ఆ పాప అక్కడికి రావటం ఆలస్యం అయిందంటే అవన్నీ గందరగోళ పడిపోయి, కంగారు కంగారుగా అరిచేవి. మళ్ళీ ఆ పాప వచ్చి వాటిని సముదాయించేంత వరకూ ఊళ్ళో వాళ్లకి ఆ రొదను భరించక తప్పేది

కాదు.



ఆ మర్రి చెట్టును ఆనుకొనే ఒక వాగు ఉండేది. ఒకసారి వానాకాలంలో విపరీతమైన వర్షాలు పడ్డాయి. వాగు పొంగింది. వరద నీళ్ళు ఊళ్ళోకి కూడా ప్రవేశించాయి. మెల్లగా ఊరు మొత్తం మునిగిపోయింది. ప్రజలు ఇళ్ళెక్కి రోజుల తరబడి గడిపారు.

అంత వరదలోనూ ఆ అమ్మాయి మర్రిచెట్టు దగ్గరికి బయలుదేరేది. పొంగి ప్రవహిస్తున్న వాగు అవతలి గట్టున నిర్భయంగా కూర్చొని ప్రవాహవేగం ఎప్పుడు తగ్గుతుందా అని ఎదురుచూసేది. వాగుకవతల మర్రిచెట్టు కొమ్మలు వాలిపోయి, ఒక్కటొక్కటిగా సోలిపోతుంటే ఇటు ప్రక్కన కూర్చొని కలవరపడేది.

కొన్ని రోజులకు వర్షాలు తగ్గాయి. వాగు ఉధృతి తగ్గింది. ఆకాశంలో మబ్బుల మాటునుండి సూర్యుడు బయట పడ్డాడు. దాగిన స్వర్గాన్ని నిద్రలేపుతున్నట్లు, సూర్యకిరణాలు మడుగుల్లో నీళ్లను తళతళలాడించాయి.

ఆ పాప గబగబా వాగును దాటుకొని మర్రి చెట్టు దగ్గరికి పరుగెత్తింది- తన నేస్తాలెలా ఉన్నారోనని, కంగారుగా.

మర్రి చెట్టు కొమ్మలు వాల్చేసి ఉంది.మునుపటి కిలకిలారావాలు, అద్భుతమైన ఆకు తోరణాలు ఇప్పుడు లేవు. అంతకు మునుపు పచ్చటి ఆకులతో కళకళలాడిన కొమ్మలు ఇప్పుడు విరిగిపోయి మొండిగా, బోసి పోయి ఉన్నై. ఆనందం, ఆప్యాయతలు నిండిన స్వరం ఒక్కటీ వినిపించలేదు పాపకు అక్కడ. అల్లరిచేసే పక్షి ఒక్కటీ లేదక్కడ. ఆటలాడే ఉడత ఒక్కటీ కనబడలేదక్కడ. వరద ఉధృతికి అన్నీ ఎక్కడికి కొట్టుకు పోయాయో

పోయాయి.



పాప చిన్నబోయింది. రోజంతా అక్కడే కూర్చున్నది విచారంగా. పాప కళ్లలోంచి కారిన కన్నీళ్ళకు ప్రకృతి స్తంభించి పోయింది. మెల్లగా చీకటి పడింది. పాప అక్కడినుండి కదల్లేదు. మెరిసే నక్షత్రాలు, ప్రకాశించే చంద్రుడు 'పాప దు:ఖాన్ని చూడలేం' అన్నట్లు మబ్బుల వెనక దాక్కున్నాయి.

రాత్రంతా నిశ్శబ్దంగా కూర్చున్న ఆ పాప, తెల్లవారు జామున గొంతు విప్పింది. మామూలుగా సంతోషపు జల్లులు చిందించే పాప గొంతునుండి గుండెల్ని కదిలించే విషాద గీతం ఒకటి వెలువడిందిప్పుడు. నిశ్శబ్దపు ఆ జామున పాప పాడిన పాట ఎంత దూరం చేరుకున్నదో, మరి?! వాగుపైనున్న మబ్బుల గుంపులు మళ్ళీ ఓసారి కరిగి సన్నగా వాన కురిపించాయి.

అంతలో ఆశ్చర్యం! ఎక్కడినుండో ఎగురుకుంటూ వచ్చిందో పిట్ట. దాని వెనకనే మరిన్ని పిట్టలు! చెంగు చెంగున ఎగురుతూ వచ్చిన చిన్న ఉడత. దాని వెనకనే మరిన్ని ఉడతలు! అన్నీ పాప చుట్టూ చేరి పాప గొంతుతో గొంతు కలిపాయి.

వాళ్లంతా కలిసి వెలువరించిన ఆ సంగీతంలో ఇప్పుడు విషాదం లేదు- నిండా క్రొత్త ప్రపంచపు సంతోషం ఉంది! ఆ సంతోషతరంగాలు అన్ని దిశలకూ విస్తరిస్తూ పోయాయి; క్రొత్త ఆశల సందేశాన్ని అందరికీ అందిస్తూ పోయాయి! నలుమూలలనుండీ మరిన్ని పక్షులు, మరిన్ని ఉడతలు ఉత్సాహంగా ఆ పాటకు గొంతులు కలిపాయి. ★

ప్రపంచం సర్వం ప్రతిక్షణం మార్పుకు లోనవుతూ ఉన్నది. మనం అది గమనించక, స్థిరంగా ఉండాలనుకుంటాం.

-గౌతమ బుద్ధుడు



భూతాలు!

భూతాలు ఎంతలేసి పని చేయగలవో ఈ కథ చదివాక తెలిసింది మాకు....!
రచన: ఎమ్.కీర్తి, 10 వ తరగతి, తేజ విద్యాలయ, కోదాడ, నల్గొండ జిల్లా

పూజ, రవి, వీణ , రఘు, శ్రీకర్.. వీళ్లంతా మిత్రులు. కిరణ్, రమేష్ కూడా మిత్రులే; కానీ వాళ్ళకీ వీళ్ళకీ పడేది కాదు. దేనికైనా ఒక వర్గం వాళ్ళు ఔనంటే, మరో వర్గం వాళ్ళు కాదనకుండా ఉండేవాళ్ళు కాదు. చిన్న చిన్న విషయాలకు కూడా అంతా గొడవ పడుతుంటే ఉపాధ్యాయులు తలలు పట్టుకొని కూర్చుండిపోయేవాళ్లు.

ఒక రోజున పూజ మిత్రులు అందరూ కొండ ఎక్కేందుకు బయలుదేరి పోయారు. కొండ మీద పాడుబడ్డ కోట ఒకటి ఉండేది. దాని చుట్టూ చాలా గుహలు ఉండేవి. అక్కడికి చేరుకున్న మిత్రులంతా కోట బయట చింత చెట్టు క్రింద కూర్చొని ఏం చేయాలో ఆలోచించసాగారు.

అంతలో వాళ్లలో ఒకరికి అనుమానంవచ్చింది: "కోటలో దయ్యాలుంటే ఎలాగ?" అని. కొందరు "ఏమీ పరవాలేదు" అన్నారు. కొందరు భయపడ్డారు. కొందరు "దయ్యాలు అసలు లేవు" అన్నారు. ఇట్లా కొంతసేపు చర్చ జరిగేసరికి వాళ్లలో అంతవరకూ భయపడని వాళ్ళకు కూడా చాలా మందికి భయం

వెయ్యటం మొదలయ్యింది.



అంతలో- కోటలోంచి పెద్దపెట్టున నవ్వులు వినిపించాయి! భయంకరమైన అరుపులు, శబ్దాలు వినిపించసాగాయి!! పిల్లలంతా భయంతో వణికిపోయారు. పారిపోదామంటే ఎవ్వరికీ కాళ్ళు రాలేదు. అందరూ గుంపుగా ఒక చోటచేరి నిలబడ్డారు. అంతలో అరుపులు ఆగిపోయాయి- గరుకుగా, కరకుగా ఉన్న గొంతొకటి, కోటలోంచి వెలువడింది:

"అహ్హహ్హ! ఇన్నాళ్ళకు నాకు తగినంత ఆహారం లభించింది. తృప్తిగా కడుపునిండా తిని ఎన్ని సంవత్సరాలవుతోందో!! ఇక ఎవ్వరూ చప్పుడు చేయకండి. ఒక్కరొక్కరుగా నాకు ఆహారం అవుదురుగాని!" అని.

మిత్రులంతా గందరగోళంగా వేడుకున్నారు- "మమ్మల్ని క్షమించండి భూతంగారూ, ఇంక ఎప్పుడూ ఇక్కడికి రామంటే రాము" అన్నారు గజిబిజిగా.

"ఆఁ..రామంటే ఎలాగ? నా ఆకలి తీరద్దూ?!" అరిచింది భూతం, కోటలోంచే. "అంతగా వేడుకుంటున్నారు గనక ఈ రోజుకి మిమ్మల్ని వదిలేస్తా- కానీ ఇకనుండి రోజూ నాకు సరిపడేంత ఆహారం పంపాలి మీరు. మనుషుల్లోతిరిగేందుకు గాను నాకు ఏ పూటకాపూట డబ్బులు కూడా పంపాలి. చెప్పండి! మీ వల్ల అవుతుందా?" అంది. ఇక వేరే దారి లేక, "ఓఁ.. తప్పకుండా పంపిస్తాం. మాట తప్పం" అని పిల్లలంతా దానికి మాట ఇచ్చేసి, "బ్రతుకు జీవుడా" అనుకుంటూ కొండ క్రిందికి పరుగుతీశారు.

ఏదో మాట అయితే ఇచ్చారుగానీ, రోజూ దానికి భోజనం, డబ్బులు ఎక్కడినుండి తెస్తారు వాళ్ళు?! తెల్లవారు జామునే

మిత్రులంతా తిరిగి సమావేశమయ్యారు.

"ఇవాళ్ళ ఎవరు ఏం తెస్తారో చెప్పండి" అడిగాడు రవి, అందరినీ. "ఇవాల్టికి ఏదోఇస్తాం, మేం తెచ్చుకున్న టిఫిన్ బాక్సులో అన్నమే ఇస్తాం. కానీ రోజూ ఇలా కుదరదు" గట్టిగా చెప్పాడు రఘు. అందరూ అవునన్నట్లు తల ఊపారు.



అంతలో అక్కడికి వచ్చారు కిరణ్, రమేష్- "ఏమైంది, మేమేమైనా సాయం చెయ్యాలా?" అంటూ.

సమస్య వినిపించారు మిత్రులంతా.

"బలే ఇరుక్కున్నారే! భూతానికి మాట ఇవ్వకుండా ఉండాల్సింది అసలు, తీరా మాట ఇచ్చాక ఇప్పుడు చేసేదేమున్నది?! మీరు రోజూ డబ్బులు, ఆహారం పంపాల్సిందే. 'బెగ్-బారో-స్టీల్' అన్నాడు ఇంగ్లీషువాడు. "అడుక్కో-అప్పుతెచ్చుకో-దొంగిలించుకో" అని. ఇప్పుడిక మీరు దొంగిలించటమే మార్గం." అన్నారు కిరణ్, రమేష్.

పూజ వాళ్లకి వేరే మార్గం ఏదీ తోచలేదు. 'ఒకసారి ఒప్పుకున్నారు కాబట్టి ఏదో ఒకరకంగా భూతం ఆకలి తీర్చాల్సిందే' అనిపించింది వాళ్లకు. ఏ రోజుకారోజు చిన్నచిన్న మొత్తాలు దొంగిలించి కోటలో వదిలి రావటం మొదలుపెట్టారు.

అయితే ఇలా మూడు రోజులు గడిచేసరికి, పిల్లల మనసుకు కష్టం అనిపించింది. 'ఇది తప్పు పని కదా, ఇట్లా ఎన్నాళ్ళు?' అని ఆలోచించటం మొదలుపెట్టారు వాళ్ళు.

ఆ రోజున శ్రీకర్ అన్నాడు: "చూడండి! మనం ఇక ఊరుకోరాదు. భూతం పని పట్టాల్సిందే. లేకపోతే ఇట్లా తప్పు పనులు చేస్తూ చేస్తూ మెల్లగా మనందరం భూతాలం అయిపోతాం" అని.

"మరెలారా, ఏం చేద్దాం?" అంది వీణ.

"భూతాలకు నిప్పు అంటే భయంట. మనం ఇవాళ్ళ వెళ్ళి కోట కిటికీలోంచి గడ్డి గాదం లోపలికి వేసి, నిప్పు పెడదాం. అది ఏం చేస్తుందో చూద్దాం" ఐడియా ఇచ్చాడు రఘు.



ఆ పథకం వినేసరికి అందరి ముఖాలూ విప్పారాయి. ఉత్సాహంగా అందరూ తలా ఒక మోపెడు ఎండు గడ్డి కోసుకెళ్ళారు. దాన్నంతా నిశ్శబ్దంగా కోటలోపలికి దూర్చి, నిప్పు అంటించారు.

ఎండు గడ్డి టపటపలాడుతూ అంటుకున్నది. కోటలోపలంతా పొగ క్రమ్ముకున్నది. మరుక్షణం కోటలోంచి దగ్గులూ, తుమ్ములూ, మనుషుల అరుపులూ వినబడ్డాయి.

మూడో నిముషంలో ప్రాణభయంతో అరుస్తూ, గడ్డిని నెట్టుకుంటూ, తోసుకుంటూ బయటపడ్డారు- కిరణ్, రమేష్!

"భూతాలు-భూతాలు" అని అరుస్తూ పారిపోబోయిన పిల్లలందరూ వాళ్ళని చూడగానే మ్రానుల్లాగా నిలబడిపోయారు.

"ఒరేయ్! మీరా?!" అని అరిచారంతా, మూకుమ్మడిగా. "భూతంమాదిరి మమ్మల్ని బెదిరించి, మా చేత తప్పుడు పనులు చేయిస్తారా? మర్యాదగా మేమిచ్చిన డబ్బులు వెనక్కి తెచ్చివ్వండి!" అని పోట్లాడి, వాళ్ళిచ్చిన డబ్బుల్ని ఎవరివి వాళ్లకు ఇచ్చేశారు.

సంగతి తెలుసుకున్న ఉపాధ్యాయులు నవ్వారు. "మీరు భయపడటం వల్లనేగా, ఇదంతా జరిగింది?! గుర్తుంచుకోండి- మూఢ నమ్మకాలు కూడదు. ఆపదలు

ఎదురైనప్పుడు ధైర్యం కోల్పోరాదు. లేకపోతే బయటి వాళ్ళకు లోకువౌతారు; అంతేకాదు-మీ మంచితనాన్నే కోల్పోయాక, అసలు ఇక ఏం ఉండీ ఏం లాభం?" అన్నారు.

పట్టుపట్టరాదు పట్టి విడువరాదు
పట్టెనేని బిగియ బట్ట వలయు
బట్టి విడచుకన్న బరగ జచ్చుటమేలు
విశ్వదాభిరామ వినురవేమ

వినుర వేమ!



తప్పులెన్నువారు తండోప తండంబు
లుర్వి జనులకెల్ల నుండుతప్పు
తప్పులెన్నువారు తమతప్పులెరుగరు
విశ్వదాభిరామ వినురవేమ

అనగ ననగ రాగ మతిశైల్లుచునుండు
దనగదినగవేము తియ్యనుండు
సాదనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినురవేమ



ఇనుము విరిగెనేని ఇరుమారు ముమ్మారు
కాచి యతుకవచ్చు క్రమముగాను
మనసు విరిగెనేని మరియంట నేర్చునా
విశ్వదాభిరామ వినురవేమ


మేక తెలివి

రచన: వి.సురేష్, ఆరవ తరగతి, జహీరాబాదు.
సౌజన్యం: మన లైబ్రరీ- "జహీరాబాద్ పిల్లల కథలు"



ఒక మేకల కాపరికి చాలా మేకలున్నాయి. అతను రోజూ ఆ మేకలన్నిటినీ అడవికి తీసుకెళ్తూ ఉండేవాడు.

ఒకసారి వాటిల్లో మేక ఒకటి మందలోంచి విడిపోయింది. దారి తప్పి, అటూ ఇటూ తిరిగి తిరిగి అలసిపోయి తనకు కనబడ్డ ఓ గుహలోకి దూరి పడుకున్నది.





ఆ గుహ ఒక తెలివి తక్కువ సింహంది. మేక పడుకునే సమయానికి ఆ సింహం వేటకని బయటికి వెళ్ళి ఉన్నది. కొంత సేపటికి వెనక్కి తిరిగి వచ్చిన సింహం ఒక్కసారిగా ఉలిక్కి పడ్డది: తన గుహలో ఎవరో దూరారు! నిద్రపోతున్నట్లు నటిస్తున్నారు!



అంతకు ముందు ఎన్నడూ సింహం అలాంటి జీవిని చూసి ఉండలేదు: పెద్ద గడ్డం,వాడిగా ఉన్న కొమ్ములూ, చూసేందుకు చిన్నగానే ఉన్నా, బలిష్ఠంగా వంపులు తిరిగి ఉన్న శరీరం!- ఆ వింత జంతువును చూడగానే సింహానికి భయం వేసింది. గుహలోంచి బయటికి పరుగెత్తి, గుహద్వారం ముందు అటూ ఇటూ తిరుగుతూ పచార్లు చేయటం మొదలెట్టిందది.



అలికిడికి నిద్రలేచిన మేక, సింహాన్ని చూసి చాలా భయపడ్డది. అయితే సింహం తోకముడుచుకొని బయటికి పరుగెత్తటం చూసేసరికి, దానికి ఎక్కడలేని తెగింపూ వచ్చేసింది. అది నేరుగా గుహ ముందుకే వెళ్ళి, "ఎవర్రా నువ్వు?!" అంటూ సింహాన్ని గద్దించింది.

"నేను సింహాన్ని" భయం భయంగా చెప్పింది సింహం.



"రా! ఒక్క సింహాన్నయినా చంపనిదే ఈ గడ్డాన్ని తీసేది లేదని ప్రతిజ్ఞ చేశాను. రా, ఇప్పుడు నిన్ను చంపి నా గడ్డానికి విముక్తి కలిగిస్తాను" అని ఒక్క ఉదుటున సింహం మీదికి దూకింది మేక.

హడలిపోయిన సింహం పరుగే పరుగు. 'బ్రతుకు జీవుడా' అనుకుంటూ మేకపోతు మరో వైపుకు పరుగు!



విలువైన స్నేహం

బి.వేద విష్ణు దత్త, సి.కుమార్, ఎ.గణేష్, 6 వ తరగతి, గోల్డ్ సెక్షన్, శ్రీ గాయత్రి ఇం.మీ.స్కూల్, అనంతపురం.



చింతలగుంట బడిలో చదివే విజయ్, ఆదినారాయణ ఇద్దరూ మంచి స్నేహితులు. ఆది నారాయణది ధనిక వ్యాపార కుటుంబం. విజయ్‌ది పేద రైతు కుటుంబం. విజయ్ శ్రద్ధగా మనసు పెట్టి చదివేవాడు; ఆది నారాయణేమో పైపైన చదివి, అరకొర మార్కులతో పాసయ్యేవాడు.

పదవ తరగతి పరీక్షల సమయం: మిత్రులిద్దరూ కలిసి చదువుతున్నారు. అకస్మాత్తుగా ఆదికి భయం మొదలయింది. "ఒరే, విజయ్! నాకు సైన్సు రాదురా! అన్నీ మర్చిపోయాను. రేపు పరీక్షలో తప్పుతానురా!" అని ఏడవటం మొదలు పెట్టాడు వాడు.

విజయ్ తన సాధనను ప్రక్కన పెట్టి, ఆదికి

ధైర్యం చెప్పాడు. "చూడు, నీకు అన్నీ వచ్చు. ఊరికే 'రావు' అనుకోకు. కావాలంటే ఇదిగో ఈ ఐదారు ప్రశ్నలు చూడు- ఇవి పరీక్షలో తప్పక వస్తాయి. ఇవి సాధన చేసి పెట్టుకో" అని రకరకాలుగా చెప్పి, బుజ్జగించి, వాడి చేత సాధన చేయించాడు.

ఆశ్చర్యం! మరునాటి రోజు పరీక్షలో విజయ్ చెప్పిన ఐదారు ప్రశ్నలూ వచ్చాయి! ఆది వాటిని చక్కగా చేశాడు. పరీక్షల్లో ఎప్పటి మాదిరే అత్తెసరు మార్కులతో పాసయ్యాడు.

***

పదో తరగతి తర్వాత మిత్రులిద్దరూ విడిపోయారు. ఆది వాళ్ల నాన్న వ్యాపార రీత్యా పట్టణం వైపుకు వెళ్ళిపోయాడు. విజయ్ పల్లెలోనే ఉండిపోయాడు. తండ్రి వ్యవసాయం బరువు ఇప్పుడు విజయ్ భుజాలమీద పడింది. స్వతహాగా తెలివైన వాడు కావటంతో విజయ్ వ్యవసాయాన్ని చక్కగా చేశాడు. అతనికి పెళ్లయింది; ఒక కొడుకు పుట్టాడు.

అంతా సజావుగా సాగిపోతున్న సమయంలో అకస్మాత్తుగా విజయ్ కొడుకు రవికి నడుము నొప్పి మొదలయింది. పల్లె వైద్యం పని చెయ్యలేదు. భార్య సరితను వెంటబెట్టుకొని విజయ్ పట్టణం చేరుకున్నాడు. అక్కడో పెద్ద ఆస్పత్రిలో రవిని చేర్పించాడు. డాక్టర్లు రకరకాల పరీక్షలు నిర్వహించారు. రవికి మూత్రపిండాల్లో పెద్ద పెద్ద రాళ్ళు ఏర్పడి ఉన్నాయి. ఆపరేషన్ మినహా వేరే మార్గం లేదు. పది లక్షల రూపాయలు అవుతుంది. ఈ రంగంలో ప్రపంచఖ్యాతి గాంచిన డా.రావు గారు తప్ప ఇతరులెవ్వరూ నయం చెయ్యలేని అరుదైన సమస్య ఇది..

విజయ్ పల్లెకు తిరిగి వచ్చి తన పరిస్థితిని అంచనా వేసుకున్నాడు. తన ఇల్లు, పొలం, చేను అన్నీ అమ్మితే పన్నెండు-పదిహేను లక్షల వరకూ రావచ్చు.. కానీ తర్వాత బ్రతికేదెలాగ?!

ఏదయితే అది అవుతుందిలెమ్మని, తన ఆస్తులన్నిటినీ కుదువపెట్టి, పది లక్షల డబ్బుతో పట్నం చేరాడు విజయ్.

అనుకున్నట్లుగానే రవి ఆపరేషన్ విజయవంతంగా జరిగింది. మూడవ రోజున

ఆస్పత్రివాళ్ళు రవిని ఇంటికి వెళ్ళిపోవచ్చునన్నారు. మందులు రాసి ఇచ్చారు. విజయ్ డబ్బు చేతబట్టుకొని బిల్లు చెల్లించేందుకు వెళ్ళాడు.

ఆశ్చర్యం! ఆ సరికే బిల్లు చెల్లించి ఉన్నది! డా.రావు గారు స్వయంగా ఆస్పత్రి ఖర్చులన్నిటినీ చెల్లించేశారు!

విజయ్ నిర్ఘాంతపోయాడు. డాక్టరుగారిని కలిసి అడిగాడు- "మీరు మావాడి బిల్లును మాఫీ చేసినందుకు ధన్యవాదాలు..కానీ.. తమరు ఇలా ఎందుకు చేశారో తెలుసుకోవచ్చునా.. ఎందుకింత దయ..?"

"ఇందులో దయ ఏమీ లేదు విజయ్, నీ దయవల్ల నేను డాక్టరును అయ్యాను; ఇప్పుడు ఈ మాత్రం చెయ్యక పోతే ఎలాగ..?"

"నాకు అర్థంకాలేదు రావు గారూ..?"

"ఇంకా అర్థం కాలేదా, ఒరే, నన్ను సరిగ్గా చూడరా, నేనురా, ఆదిని!" డాక్టరు రావుగారు కళ్ళజోడు తీసి నిండుగా నవ్వారు.

విజయ్ మరోసారి నిర్ఘాంతపోయాడు.

"నీ చేత సైన్సు చెప్పించుకొని పదో తరగతి పాసయ్యాను కదా, ఆ తర్వాత పట్టుదలకొద్దీ సైన్సే చదివానురా. డాక్టరునయ్యాను; విదేశాలకెళ్ళాను; డబ్బు, పేరు సంపాదించుకున్నాను.



నీకోసం చాలా వెతికాను. ఇన్నాళ్లకు దొరికావు!" అని విజయ్‌ని కౌగిలించుకున్నారు, డా.ఆది నారాయణ రావు గారు!

విజయ్, ఆదిల స్నేహం అటుపైన కలకాలం వర్థిల్లింది.



తొట్టిగ్యాంగ్

బి.వేణుగోపాల్, జవహర్ నవోదయ విద్యాలయం, లేపాక్షి.



అన్ని బడులలో లాగే కల్లూరు పాఠశాలలో కూడా ప్రొద్దున మొదటి పీరియడ్‌లో తరగతి ఉపాధ్యాయుడు వచ్చి పిల్లల హాజరు సంఖ్య చూసుకునేవారు. మళ్ళీ మధ్యాహ్న భోజనం తర్వాత ఒకసారి- ఇలా రోజూ రెండుసార్లు హాజరు సరి చూసుకొనేవాళ్ళు.

బడిలో 470 మంది పిల్లలుండేవారు. వాళ్లందరిలోనూ అల్లరి పిల్లలు ప్రత్యేకంగా ఓ ఐదుగురు ఉండేవాళ్ళు. ముచ్చటగా తమని తాము 'తొట్టి గ్యాంగ్' అని పిలుచుకునేవాళ్ళు వాళ్ళు. చక్కని ఎత్తు, శరీరాకృతి కలిగిన అనిల్ వాళ్ళ గ్యాంగు నాయకుడు. వేణు, రేవంత్, సిద్దార్థ, మణి గ్యాంగు సభ్యులు.

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎవరు వాళ్లకు ఎన్ని రకాలుగా చెప్పినా, లాలించినా, బుజ్జగించినా, తిట్టినా, కొట్టినా వాళ్ళు మటుకు వాళ్ళ పద్ధతులను మార్చుకోలేదు.

'నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు?!'- అదీ, వాళ్ళ ధోరణి.



రకరకాలుగా అల్లరి చేసేసిన తర్వాత తొట్టి గ్యాంగుకు బడిలో ఉండటం కష్టంగా తోచింది. 'బడి జరుగుతుండగా మనం బయట తిరిగితే ఎంతగొప్ప?!' అనుకున్నారు. మొదటి రెండు పీరియడ్‌ల తర్వాత ఎవరికివాళ్ళుగా బడినుండి బయటపడటం మొదలుపెట్టారు. మొదటి పీరియడ్ తర్వాత ఇక హాజరు సమస్య ఉండదు కద!

స్కూల్‌కి దగ్గరలోనే ఓ చెరువు ఉండేది. వెళ్ళి చెరువులో ఈదులాడడం, ఎండ్రకాయలు, చేపలు పట్టి, ఉప్పు కారం వేసి, కాల్చుకుని తినటం మొదలు పెట్టారు వీళ్ళు. అట్లా రోజూ స్కూల్ కి డుంకా కొట్టేవారు. వాళ్లు అట్లా చేస్తున్న సంగతి బడిలో పిల్లలందరికీ చెప్పుకునేవాళ్ళు తొట్టిగ్యాంగు వాళ్ళు. అయితే ఆ సంగతి ఉపాధ్యాయులెవ్వరికీ తెలిసే అవకాశం లేకపోయింది.

అయితే, అట్లా ప్రతి రోజూ డుంకా కొట్టటం వల్ల వాళ్ళకు టీచర్లు చెప్పిన పాఠాలు అసలు అర్థమయ్యేవి కాదు. ఫలితంగా పరీక్షలలో చాలా తక్కువ మార్కులు వచ్చేవి. టీచర్లు కూడా బాగా తిట్టి పెట్టేవారు. అయినప్పటికీ 'కుక్క తోక వంకర' అన్నట్లు వాళ్ళ బుద్ధి, ప్రవర్తన మాత్రం మారలేదు. తొట్టిగ్యాంగ్ చేసే ఈ చేష్టలు వాళ్ల తల్లిదండ్రులకు కూడా తెలిసేవి కావు. 'పిల్లలు పాఠశాలకు వెళ్ళి బాగా చదువుకుంటున్నారు' అనుకునేవాళ్ళు వాళ్ళు.

రానురాను తొట్టిగ్యాంగుకు ఎప్పుడూ చెరువు దగ్గరికే పోవటం విసుగ్గా అనిపించసాగింది. చెరువుకి 2 మైళ్ళ దూరంలో ఉన్న మామిడి-జామ తోటలు వాళ్ల దర్శనీయ స్థలాల పట్టీకి

జమ అయినాయి. ఆ తోటల్లోకి పోయి ఎంచక్కా కడుపు నిండా కాయలు తింటే వాళ్ళు ఇక మధ్యాహ్నం భోజనానికి కూడా రానవసరం ఉండదు! స్కూల్ వదిలే సమయానికి నేరుగా పుస్తకాల కోసమే బడికి వెళ్లచ్చు!



ఒకరోజు రాత్రి బాగా వర్షం పడింది. గుంతల్లో అంతటా నీరు నిండింది. మరునాడు ఉదయం ఆకాశం మబ్బులతో నిండి ఉంది. అడవి జంతువుల సంచారం మొదలయింది. అయినా అలవాటైన ప్రాణాలు కద, తొట్టిగ్యాంగు ఊరికే ఉండలేకపోయింది. ప్రొద్దున రెండవ పీరియడ్ అవ్వగానే ఐదుగురూ గోడ దూకి బయట పడ్డారు.

చెరువు దారి పట్టారు. దారి అంతా బురద బురదగా ఉంది. మధ్యలో అందరూ ఆగారు. "ఒద్దురా! ఇప్పుడు చెరువుకి వెళ్ళడం కష్టం. తోటలకు వెళ్దాం. తారు రోడ్డు మీదుగా వెళ్లచ్చు" అని నిర్ణయించుకున్నారు. రోడ్డు బాట పట్టారు. ఆనందంగా గంతులేస్తూ రోడ్డు మీద ఆడుతూ పాడుతూ చాలా దూరం పోయారు. తోట దగ్గరికి చేరుకున్నారు.

అంతలో అకస్మాత్తుగా వాళ్లకొక అడవిపందుల గుంపు ఎదురు పడింది. సాహస వీరులు కదా, తొట్టిగ్యాంగువాళ్ల చేతుల్లో రాళ్ళు ప్రత్యక్షం అయ్యాయి. వాళ్లు వాటి మీద రాళ్ళు వెయ్యటం- అవి వాళ్ల మీదికి దూకటం- ఏది ముందు జరిగిందో చెప్పటం కష్టమే. మరుక్షణంలో అవి వాళ్లని అందిన చోటునల్లా పొడిచి, చీరి కొన ప్రాణాలతో వదిలి ముందుకు సాగిపోయాయి.

సరిగ్గా అదే సమయానికి ద్విచక్ర వాహనంపై బడికి వస్తున్న ఉపాధ్యాయుడు ఒకాయన జరుగుతున్న భీభత్సాన్ని చూసి ఆగిపోయి,

అందరికీ సమాచా రం అందిం చాడు."ఎవరో పిల్లలుపాపం, అడవి పందుల బారినపడ్డారు" అని తెలియగానే బడి పిల్లలు, ఉపాధ్యాయులు అందరూ బయలుదేరి వచ్చారు సంఘటనా స్థలానికి.



చూస్తే అక్కడున్నది తొట్టిగ్యాంగ్!

అందరూ కలిసి వాళ్లని ఆసుపత్రిలో చేర్పించారు.

"వీళ్ళు ఈ సమయానికి బడిలో ఉండాలి కదా, ఇంత దూరం ఎందుకు వచ్చారు?" అని అడిగారు ప్రధానోపాధ్యాయులవారు. ఎవ్వరూ సమాధానం ఇవ్వలేకపోయారు. చూడగా వాళ్ళందరికీ హాజరు పడి ఉన్నది మరి! ప్రధానోపాధ్యాయులవారు ఈ విషయాన్ని ఊరికే పోనివ్వలేదు- బడి సమయంలో ఎవ్వరూ బయటికి పోకుండా ప్రహరీ గోడ, దానికొక గేటు, తాళం, ద్వార రక్షకుడు- ఇవన్నీ వచ్చాయి.

తల్లిదండ్రులకు కబురు అందింది. ఇంత పెద్ద సంఘటన జరిగితే పేపర్లు మాత్రం ఎందుకు ఊరుకుంటాయి? తొట్టిగ్యాంగు గురించి పేపర్లలో అంతటా రాశారు. అందరూ వాళ్లని మెత్తగా చీవాట్లు పెట్టారు.

ఒక సారి ఆసుపత్రిలోంచి బయట పడ్డాక అసలు ఇక తొట్టిగ్యాంగ్ పూర్తిగా రద్దే అయిపోయింది. కుంటుకుంటూ, ముక్కుతూ, మూల్గుతూ ఉన్న వాళ్లకు ఇక బడి నుండి తప్పించుకొని బయటికి వెళ్ళాలనే అనిపించలేదు. ఆ రోజు నుండి హాయిగా చదువుకుంటూ మంచి బుద్ధిమంతుల్లా మెలిగారు. ★

జీవితంలోని ప్రతి క్షణాన్నీ జ్ఞాన సముపార్జనకోసం వెచ్చించు



"జూ"అలా మొదలైంది

నిజంగా జంతు ప్రదర్శన శాలలు ఎలా మొదలయ్యాయో గాని, సాయి ప్రపల్లిక ఊహ మాత్రం నిజం అనిపించేంత బాగుంది...

రచన: టి.సాయిప్రపల్లిక, 9th రోజ్,అరవింద స్కూల్.

అనగనగా ఆఫ్రికాలో ఒక ఊరు.ఆ ఊరు పేరు జోన్.

జోన్ చాలా అందమైన ఊరు.ఆ ఊరి ప్రజలంతా ఎంతో ఐకమత్యంగా కలిసి మెలిసి ఉండేవాళ్ళు . ఏ చిన్న పండుగ వచ్చినా వాళ్లంతా ఎంతో సంతోషంగా జరుపుకునేవాళ్ళు.



ఆ ఊళ్ళోనే "కీరో" అని ఒక అబ్బాయి ఉండేవాడు.

కీరో ఎంతో మంచివాడు. పొలం పనుల్లోనూ, ఇంటి పనుల్లోనూ తను వాళ్ళ అమ్మానాన్నలకు ఎంతో సహాయం చేసేవాడు.

అవసరాల్లో ఉన్న వారికి సాయపడటమంటే కీరోకి ఎంతో ఇష్టం.



ఒక సారి కీరో తమ పొలానికి వెళ్ళాడు. పొలం గట్టుమీద గ్రద్ద ఒకటి ఓ కుందేలును చంపేందుకు ప్రయత్నిస్తోంది.

వెంటనే ఆ గ్రద్దపైకి రాళ్ళు విసరడం మొదలుపెట్టాడు కీరో.

కానీ ఆ గ్రద్ద కుందేలును విడవకుండా, దాన్ని పొడుస్తూనే ఉంది.

"ఇలాకాద"ని, కీరో ఆ గ్రద్దదగ్గరకు వెళ్ళి దాన్ని తోలడం మొదలుపెట్టాడు.

కానీ, ఆగ్రద్ద కీరోపైకి తిరగబడి, వాడివీపుమీద పొడవటం మొదలుపెట్టింది.

అప్పుడు కీరో మొదట -కుందేలుని తన దగ్గరకు తీసుకొని, దాన్ని తన షర్టులో దాచాడు. అటుపైన గ్రద్దను గట్టిగా తరిమి వెళ్ళగొట్టాడు. గాయపడ్డ కుందేలును తన ఇంటికి తీసుకెళ్ళాడు.

ఇప్పుడు తన దగ్గర ఏడు కుందేళ్ళు ఉన్నాయి!



ఇదివరకే తను ఆరు కుందేళ్లను, మూడు పావురాలను, ఒక కుక్కను, నాలుగు పిల్లులను ప్రాణాపాయ స్థితినుంచి కాపాడి పెంచుతున్నాడు. వాటిని పెంచడంలో కీరోకి వాళ్ళ అమ్మానాన్నలు, ఆ ఊరిజనాలు అందరూ సాయపడేవారు.

కాలం గడిచేకొద్దీ, కీరో దగ్గరచేరే జంతువుల

సంఖ్య పెరగసాగింది. వాటన్నింటినీ సంబాలించడం కోసమని ఊరంతాకలిసి ఒక ప్రత్యేకమైన స్థలాన్ని ఏర్పాటుచేద్దామనుకున్నారు. అనుకున్నట్టుగానే, వారంతా కలిసి చందాలు వేసుకుని, కాపాడబడే జంతువులకోసం ఒక ప్రత్యేకమైన స్థలాన్ని ఏర్పాటుచేశారు.ఆ తర్వాత ఆ స్థలానికి చాలా జంతువులు బయటినుండి కూడా రావటం మొదలుపెట్టాయి. అవన్నీ కలసి అక్కడ ఆడుతూ పాడుతూ ఎంతో హాయిగా గడిపేవి.

అలా మొదలైందన్నమాట- మొట్టమొదటి "జూ"!

భాస్కరా!

ఎడపక దుర్జనుండొరుల కెంతయు గీడొనరించును గానియే
ఎడలను మేలు సేయ డొకయించుక యైనను; జీడ పుర్వుతా
జెడ దిను నింతెకాక పుడిసెండు జలంబిడి పెంచనేర్చునే
పొడవగుచున్న పుష్పఫల భూరుహ మొక్కటినైన భాస్కరా?

భావం: చీడపురుగు ఎన్నాళ్లయినా తాను చెడ తింటుంది తప్పిస్తే పెరిగి పెద్దయి పూలు-పళ్ళు ఇచ్చే మొక్కను ఒక్కదాన్నిఅయినా పెంచుతుందా? పెంచదు కదా? అదేవిధంగా చెడు నడవడి కలవాడు కూడా ఇతరులకు ఏనాటికయినా కీడే చేస్తాడు కాని కొంచెం కూడా మేలు చేయడు.

మీసాలమ్మ మాట: మనం చెప్పినట్లే జరగాలని అనుకోవటం వల్లే మనకు ఇతరులు విరోధులవుతారు. మన అభిప్రాయాన్ని అందరిచేతా అవుననిపించుకోవటంలోనే మన సామర్థ్యం ఉంటుంది.

సేకరణ, సౌజన్యం: పసిడి మొగ్గ, బడిపిల్లల సాహిత్య మాసపత్రిక, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆముదాలవలస.



మారిన దొంగ

ఈ కథలో హేమంతుడిలాంటి పిల్లలమేగా, మనం అందరమున్నూ..? దొంగలు ఎదురు పడితే మరి మనం ఎలా ప్రవర్తిస్తామో, మరి ఆ దొంగలు ఎలా ప్రవర్తిస్తారో...?!

రచన: డా.సిరి, మిర్యాలగూడ, నల్గొండజిల్లా.

మహతీపురంలో హేమంతుడనే పేదవాడు ఉండేవాడు. అతని చిన్నతనంలోనే తండ్రి చనిపోయాడు. తల్లి తులశమ్మే అతడ్ని అల్లారు ముద్దుగా పెంచింది. తన ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో కూరగాయలు పండించి, వాటిని పొరుగు గ్రామంలోని సంతలో అమ్మేది ఆమె. అలా కూరగాయలు అమ్మగా వచ్చే కొద్దిపాటి ఆదాయంతోనే కొడుకుకి ఏ లోటూ రానీయకుండా ప్రేమగా చూసుకునేది తులశమ్మ. తనకోసం తల్లి పడుతున్న కష్టం చూసి హేమంతుడు కూడా ఆమెకు అన్ని పనుల్లోనూ సాయపడుతుండేవాడు.

హేమంతుణ్ణి గురుకులానికి పంపి

విద్యావంతుడ్ని చెయ్యాలనుకున్నా, తనదగ్గరున్న డబ్బు అందుకు సరిపోదని తెలిసి లోలోపలే బాధ పడిపోయేది తులశమ్మ. అయితే తనకు తెలిసిన చాలా విషయాల్నే కొడుకుకి నేర్పేది. తల్లి చెప్పిన ప్రతి విషయాన్నీ శ్రద్ధగా నేర్చుకునేవాడు హేమంతుడు.



ఒకనాడు తులశమ్మకు జ్వరం వచ్చింది. అంచేత ఇల్లు కదలలేకపోయింది. తల్లికి బదులు తాను సంతకు వెళ్ళాలని నిర్ణయించుకున్న హేమంతుడు, తల్లికి జాగ్రత్తలు చెప్పి, కూరగాయల తట్ట నెత్తికెత్తుకొని పొరుగుగ్రామంలో సంతకు పోయాడు. అక్కడ కూరగాయలు అమ్మగా వచ్చిన డబ్బుతో తిరుగు ప్రయాణం అయ్యాడు.

దారిలో ఒక పెద్దాయన ఎదురయ్యాడతనికి. వంగిపోయిన నడుము; చేతిలో ఒక కర్రతో ఉన్న ఆ పెద్దాయన హేమంతుడిని ఆపాడు:

"నాయనా! నాది ఆ పక్క ఊరు. పని మీద ఈ పక్కకి వచ్చాను. మా ఊరికి వెళ్ళాలంటే మధ్యలో ఉన్న ఈ అడవిని దాటాలి. నేనెప్పుడూ ఒంటరిగా అడవిని దాటింది లేదు. ఒక్కడినే వెళ్ళాలంటే భయంగా ఉంది" అన్నాడాయన నీరసంగా.

హేమంతుడికి అతడిపట్ల జాలి కలిగింది. "దానిదేముందిలే తాతా, నేను నిన్ను అడవి దాటిస్తానులే" అన్నాడు, తాత చెయ్యి పట్టుకుంటూ.

ఇద్దరూ నడవటం మొదలుపెట్టారు.

అడవిమధ్యలోకి చేరుకోగానే ఉన్నట్లుండి ఆగాడు తాత -

"ఏమైంది తాతా? ఎందుకు ఆగిపోయావు?" అని అడిగాడు హేమంతుడు.



"ఎవర్రా తాత? నీవనుకుంటునట్టు నేను ఒట్టి ముసలాడ్ని కాను! గజదొంగ రంగడిని! మర్యాదగా నీదగ్గరున్న డబ్బంతా నాచేతిలో పెట్టు. లేకపోతే ఈ కత్తితో నీ పీక కోస్తా!" అంటూ వికృతంగా నవ్వుతూ తన దగ్గరున్న కత్తిని తీశాడు రంగడు.

హేమంతుడు తన దగ్గరున్న డబ్బును అతని చేతికి అందిస్తూ "నా దగ్గర ప్రస్తుతం ఉన్నది ఇంత మాత్రమే తాతా, బహుశ: ఇది నీ అవసరాలకి ఏమాత్రం చాలక పోవచ్చు. అయినా ఉన్నది ఈ కాసిన్ని డబ్బులే కనక- ఇంద, తీసుకో!" అన్నాడు మామూలుగా.

అప్పటి వరకూ తన బెదిరింపుకులోనైన ప్రతివాడూ ప్రాణభయంతో గిజగిజలాడుతూ తన కాళ్లమీద పడి బ్రతిమలాడటమే తెలుసు రంగడికి. అయితే హేమంతుడు తనను చూసి భయపడకపోవడం, పైగా అడిగిన వెంటనే తన దగ్గర ఉన్న డబ్బునంతా ఇవ్వబూనటం, అంతాచేసి పరమ స్నేహంగా మాట్లాడటం, రంగడిలో ఏదో తప్పు చేస్తున్నానన్న భావనను కలిగించాయి.

అయినా అదేమీ పైకి కనబడనీయకుండా "ఒరే, చిన్నోడా! ఎవరి పేరు వింటే ఈ రాజ్యంలో ప్రజలందరూ భయపడతారో ఆ రంగడిని నేనే! నన్ను చూస్తే నీకు భయం వెయ్యడం లేదా?!"అని అడిగాడు , కరకు గొంతుతో.

"నువ్వు ఎవరైతేనేమి తాతా, నువ్వూ నాలాంటి మనిషివేగా? 'సాటిమనిషిని చూసి భయపడటమంటే వారిలో మానవతకు బదులు క్రూరత్వాన్ని చూసినట్లే' అని మా అమ్మ చెప్తూంటుంది. క్రూరత్వం మృగాల నైజం; మనుషుల తత్వం అది కాదు కదా?



మరి అలాంటప్పుడు, సాటి మనిషివి- నీలో క్రూరత్వాన్ని చూశానంటే నిన్ను అవమానించినట్లే కదా?!" అన్నాడు హేమంతుడు.

"కానీ నేను దొంగను- గజదొంగను! నువ్వు నన్ను చూసి భయపడలేదు సరే- నీకు కనీసం నామీద కోపం కూడా రావట్లేదా?!" అడిగాడు రంగన్న- కొంచెం తగ్గుతూ.

"పుట్టుకతోనే ఎవ్వరూ దొంగలుగా పుట్టరు కద, తాతా?! నువ్వు దొంగగా మారావంటే, మరి నీ తెలివికి, సామర్థ్యానికి తగిన పని వేరే ఏదీ నీకు దొరికిఉండక పోవచ్చు; లేదా నీ సామర్థ్యం ఏమిటో, నీ ప్రతిభ ఏమిటో ఇతరులకు అర్థమయ్యేలా తెలియజెప్పటం నీకు రాలేదేమో.

సాధారణంగా మనం ఎప్పుడైనా ఒక మంచి పనిని చేసుకుంటూ పోయామనుకో; ఆ పనే మనకు ఇంకా చాలా మంచి పనులు నేర్పుతుంది. అటుపైన మనం చేయాల్సిందల్లా మన ప్రతిభను మరింత అభివృద్ధి చేసుకునేందుకు ప్రయత్నించటమే.

అంత కాకపోయినా, నీ ప్రయత్నాలు నిన్నెంతగా చీకటిలోనూ, నిరాశలోనూ మిగిల్చినా, సన్మార్గాన్ని నువ్వు వదలనంతవరకూ సంతోషం నీతోనే

ఉంటుంది.

ఇకనైనా నువ్వు సన్మార్గంలో నడవగల్గితే బాగుండును- కానీ నీ ప్రగతికి మేలు చెయ్యగలిగే సహాయం ఏదీ నేను చెయ్యలేకపోతున్నానే అని బాధగా ఉంది.

కనీసం ఈ కాసిన్ని డబ్బుల్నీ తీసుకుంటే నేను సంతోషపడతాను" అన్నాడు హేమంతుడు, ప్రశాంతంగా.

రంగడి మనసు లోపలినుండి పశ్చాత్తాపం పెల్లుబికి వచ్చింది. ఇన్నాళ్లూ తను చేస్తున్న పనిలో మంచి చెడ్డలను గుర్తించక క్రూరంగా ప్రవర్తించినందుకూ, అందరినీ బెదిరిస్తూ గడిపినందుకు ఎంతో బాధపడ్డాడు రంగడు.

తన ప్రవర్తనలో మార్పు తీసుకొచ్చినందుకు, హేమంతుడికి కృతజ్ఞతలు చెప్పి, అతడి డబ్బును అతనికి ఇచ్చేశాడు.

ఇకపై తాను మంచిమార్గంలో నడుస్తానని హేమంతునికి మాట ఇచ్చిన గజదొంగ రంగన్న, అటుపైన మనిషిగా మారాడు. ఆనందంగా జీవించాడు.

అన్నీ అడుగుదాం!

టీచరు: పరీక్ష రాసేటప్పుడు పెన్సిలు, స్కేలు వంటివి మీరే తెచ్చుకోవాలి. పక్కవారిని ఏ వస్తువూ అడగకూడదు.

స్టూడెంట్: మరి అయితే జవాబులు అడగొచ్చా టీచర్?!

తీరికలేని పని!

యాచకుడు: ఏదైనా ఉంటే పెట్టమ్మా!

సువర్ణ: ఆరోగ్యంగానే ఉన్నావుగా, ఏదైనా పనిచేసుకుని తినొచ్చుగా?

యాచకుడు: తీరికలేదమ్మా, ఉదయం నుండి సాయంత్రందాకా అడుక్కోడానికే సరిపోతుంది.



సమధర్మ్ముడు

రచన: జయరామి రెడ్డి, శ్రీసాయి కుట్టుపని శిక్షణా కేంద్రము, చెన్నేకొత్తపల్లి.

కృష్ణాపురం గ్రామ పెద్ద సమధర్మ్ముడు ఎంతో తెలివైనవాడు. సమస్యలకు పరిష్కారాలు, తీర్పులు చెప్పడంలో ఆయనకి ఆయనే సాటి. సమధర్మ్ముడు చెప్పే సందర్భోచితమైన సలహాలు, సూచనలు, తీర్పులూ గ్రామస్థులందరికీ నచ్చేవి. అందరికీ ఆయనంటే ఎంతో గౌరవం ఉండేది.

రాను రాను సమధర్మ్ముడి పేరు ప్రఖ్యాతులు బాగా పెరిగాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలుకూడా చాలామంది ఆయనదగ్గరకు వచ్చి తమ సమస్యల్ని పరిష్కరించుకునేవాళ్ళు.

ఇది ఇలా ఉండగా, ఒకనాడు దేవలోకంలో దేవతలందరూ కలిసి సభ ఏర్పాటు

చేసుకున్నారు: 'యమధర్మరాజు ఎంత కఠినమైన శిక్షలు వేస్తున్నాకూడా, భూలోకంలో మనుషులు మాత్రం మారటం లేదు. ఎందుకు?' అని వారంతా చర్చించుకుంటున్నారు.



చర్చ మధ్యలో, నారదుడు అన్నాడు"అందరికీ ఒకే తరహాలో చాలా కఠినమైన శిక్షలు వేస్తున్నాడు మన యమ ధర్మరాజు. అందుకే జనాలంతా వాటికి స్పందించటం మానేశారు. అయితే మరి భూలోకంలో సమధర్ముడు ఎంత చక్కగా, సమయస్ఫూర్తితో వ్యవహరిస్తున్నాడంటే, మనుషులంతా వరసపెట్టి మారిపోతున్నారు" అని.

వెంటనే యమధర్మరాజుకి కోపం వచ్చింది. "ముందు ఆ సమధర్ముడు సమస్యల్ని ఎలా పరిష్కరిస్తున్నాడో చూస్తా- ఆ తర్వాత నారదుడి పని పడతా" అని వెంటనే మానవ రూపంలో సమధర్ముడు ఉండే ప్రాంతానికి చేరుకున్నాడు.

ఆ రోజున రంగన్న అనే రైతు పొలంలో దారినపోయే వ్యక్తులు ఐదుగురు దూరారు. మామిడి పండ్లు కోసుకొని ఆరగించ బోతూ పట్టుబడ్డారు. రంగన్న ఆ ఐదుగురినీ సమధర్ముడి దగ్గరికి తెచ్చి నిలబెట్టాడు. సమస్యను ఆయన ఎలా పరిష్కరిస్తాడో చూసేందుకు యముడితో పాటు చాలామంది వచ్చి నిలబడ్డారు.

సమధర్ముడు ఐదుగురినీ చూశాడు. మొదటివాడు, రెండోవాడు తల వాల్చుకొని నిలబడి ఉన్నారు. మూడోవాడు, నాలుగోవాడు తల మామూలుగా పెట్టుకొని ఉన్నారు. ఐదోవాడు తల ఎత్తి నిలబడి ఉన్నాడు.

"మీరు అందరూ అసలు తోటలోకి ఎందుకు

వెళ్ళారు?" అడిగాడు సమధర్ముడు.

"మేం అందరం పట్టణం వెళ్ళేందుకు ఆటోలో బయలుదేరాం. దారి మధ్యలో అది చెడిపోయింది. మేం నడుస్తూ వెళ్తూ, ఈయన తోటలో ఆగాం. ఇలా పట్టుబడ్డాం" అన్నారు వాళ్ళు.

"అందరిదీ ఒకే ఊరా?" అడిగాడు సమధర్ముడు.

"కాదు" అన్నారు వాళ్ళు.

సమధర్ముడి చూపు యమధర్మరాజు మీదికి ప్రసరించింది. "నువ్వెవరు? కొత్తవాడిలా ఉన్నావు?" అన్నాడు.

"కొత్తవాడినే, నీ న్యాయ విచారణ ఎలా ఉంటుందో చూసేందుకు వచ్చాను"అన్నాడు.

సమధర్ముడు యమధర్మరాజును తీసుకొని, ఒక గదిలోకి వెళ్ళాడు. మొదటి వాడిని లోనికి రమ్మన్నాడు.

"నీ పేరు, ఊరు, వృత్తి?" అడిగాడు సమధర్ముడు.

"అయ్యా, నా పేరు శ్యామసుందరశాస్త్రి. మాది బాకారం. నేను పురోహితుడిని" అన్నాడు మొదటివాడు.



"పండ్లు ఎందుకు కోసావు?" సమధర్ముడు అడిగాడు.

అతని తల మరింత వాలిపోయింది. "ఆకలేసింది.." అని గొణిగాడు.

"అయ్యా, శాస్త్రిగారూ, మీ ఇంటి ముందు నిలబడ్డ బిచ్చగాళ్ళు ఆకలితో 'అమ్మా అన్నం పెట్టు తల్లీ' అని అడుగుతారా, లేకపోతే మీ ఇంట్లోకి దూరి చేతికందింది తింటారా? అడిగాడు సమధర్ముడు.

అతని కళ్లలో నీళ్ళు తిరిగాయి. "అయ్యా! నన్ను మన్నించండి. తప్పు చేశాను. ఇకపై

ఇట్లాంటి తప్పు ఎన్నడూ చేయను" అన్నాడు సమధర్ముడి కాళ్ళ మీద పడుతూ. సమధర్ముడు అతన్ని పట్టుకొని ఆపాడు. "మీరు మంచివాళ్ళు. అర్థం చేసుకోగలరు. ఇలాంటి తప్పు ఎన్నడూ చేయకండి" అని చెప్పి అతన్ని వదిలేశాడు.

"మరి శిక్ష..?" నివ్వెరపోయాడు యమధర్మరాజు.

తర్వాత రెండవ వాడిని పిలిపించాడు సమధర్ముడు.

"నీ పేరు? వృత్తి? నీ వెందుకు నీ ఇలాంటి పని చేశావు?" అడిగాడు అతన్ని.

"అయ్యా! నా పేరు కుబేరుడు. వ్యాపారిని. ఓ పండు తినేసి వెళ్తే నగరంలో టిఫిన్,భోజనాల ఖర్చులు మిగులుతాయని.." గొణిగాడు అతను.

"సరే, మరి ఊర్లో ఉన్న జనాలను పిలుస్తాను; నీ సరుకులన్నీ ఎత్తుకెళ్ళమంటాను; వాళ్ళకూ ఏదో కొంచెం మిగులుతుంది కద" అన్నాడు సమధర్ముడు.

శెట్టి కళ్ళు తేలవేశాడు. "అయ్యా ! అంతపనిచేయకండి . నేను రెండు మామిడిపళ్ళు తిన్నమాట నిజం. వాటికి గాను ఆ రైతుకు ఎంత డబ్బు ఇవ్వాలో చెప్పండి; డబ్బు ఇచ్చి నా తప్పును సరి దిద్దుకుంటాను" అన్నాడు.



"ఐదు వందల రూపాయలు జరిమానా విధించాడు సమధర్ముడు.

కుబేరుడి ముఖం వికసించింది. చటుక్కున జేబులోంచి ఐదు వందల రూపాయలు తీసి ఇచ్చాడు. " అయ్యా, ఈ డబ్బుదేముంది, రెండు రోజులలో సంపాదించుకోగలను. ఊర్లో వాళ్లంతా ఒక్కో సరుకు ఎత్తుకెళితే 10 వేలు

పోవును గద!" అన్నాడు పోబోతూ.

"ఆగాగు- జరిమానా కట్టావు కదా అని తప్పు మళ్ళీ చేసేవు- ఈసారి దొరికావంటే వెయ్యి రూపాయలు కట్టాల్సి వస్తుంది జాగ్రత్త!" వేలెత్తి బెదిరించాడు సమధర్ముడు.

"అయ్యో, స్వామీ! ఇక మీరు స్వయంగా వచ్చి నిలబడి తప్పు చేయమన్నా చేయను నేను.. మీ పాదాల ఆన" అని పాదాలంటి మొక్కి పోయాడు శెట్టి.

సమధర్ముడు మూడవ వాడిని రమ్మన్నాడు.

"నువ్వెందుకు దొంగ పని చేశావు?" అడిగాడు సమధర్ముడు.

"అయ్యా, నా పేరు రాజశేఖర్. ఆ రైతు పొలం బాగుంది; చక్కని కాత కాసింది అని చూస్తూ ఉన్నాను. అంతలో తెగి పడిన పండు ఒకటి కనిపిస్తే తిన్నాను తప్ప, వేరే ఏమీ లేదు" సమాధానం ఇచ్చాడు మూడోవాడు.

"నీ వృత్తి?" అడిగాడు సమధర్ముడు.

"వ్యవసాయం" అన్నాడతను.

"సరే, మరైతే ఇప్పుడు పరిష్కారం ఏమిటో నువ్వే చెప్పు" అన్నాడు సమధర్ముడు.

"అయ్యా! అసలైతే నేను అక్కడ ఉండి ఉండకూడదు. ఉన్నాను, అడక్కుండా తిన్నాను- అది తప్పే. దానికి గాను మీ ఊరందరి ఉపయోగం కోసం నన్నేం చేయమంటే అది, సంతోసంగా చేస్తాను" అన్నాడు అతను. "అయితే సరే, వెళ్ళు. ఊరి బాగుకోసం నీకు నచ్చిన పని ఏదైనా చేసి పో" అని విడిచి పెట్టాడు సమధర్ముడు.

"ఏం పనో కూడా చెప్పలేదే..?" నోరు నొక్కుకున్నాడు యమధర్మరాజు.

నాలుగోవాడు వచ్చి చెప్పాడు- "అయ్యా! నా పేరు మల్లన్న. వయసు మళ్ళిన అమ్మా నాన్నలు, భార్య, పిల్లలు- ఇంతమంది ఆధారపడి ఉన్నారు, నామీద. నా తల్లి దండ్రులు పెద్దవాళ్ళు; పిల్లలు చిన్నవాళ్లు. భార్య ఆరోగ్యం అంతంత మాత్రం కావడంతో నేనొక్కడినే పనిచేసి, వచ్చిన డబ్బులతో ఇంటిని గుట్టుగా నడుపుకుంటూ వస్తున్నా. నిన్న రాత్రి మాకు ఇంట్లో అన్నం సరిపోలేదు- ఇంటి పెద్దగా నేను కొంచెమే తిని

ఊరుకున్నాను. అందువల్ల బాగా ఆకలిగా ఉండింది. చక్కని పండ్లు కనిపిస్తే ఆశకు లోనై తిన్నాను. నేను అడగకుండా తినటం తప్పే. అందుకు గాను ఈ రోజంతా తమరు ఏ పని చెబితే అది చేస్తాను. కేవలం మాకుటుంబానికి సరిపడ భోజనం పెట్టించండి చాలు- ఇకమీద నేనెప్పుడూ ఇలాంటి పని చేయనంటే చేయను. నన్ను నమ్మండి" అన్నాడతను. సమధర్ముడు అతనికే వెంటనే పని కల్పించాడు.


"అదేం శిక్ష?!" అనలేక ఊరుకున్నాడు యమధర్మరాజు.

5 వ వాడు రంగు రంగుల జులపాలతో, చలువ కళ్ళద్దాలతో, కొత్త తరం బట్టలు ధరించి మెరిసిపోతున్న యువకుడు.

అతను చెప్పాడు "అంకుల్!నా పేరు రాంకి. ఫ్రూట్స్ బాగా కనిపిస్తే కోసుకొని తిన్నా,అంతే" అని.

"మరి రైతు సంగతి ఎట్లా, రాంకి?" అడిగాడు సమధర్ముడు.

"నాకేంతెలుసు? నేనేమీ చెయ్యలేను. నా దగ్గర డబ్బులుకూడా ఏమీ లేవు. మీరెవ్వరూ నన్నుఏమీ చేయలేరు" అన్నాడు రాంకీ.



"చూడు నాయనా! మంచి ప్యాంటు, షర్టు, కళ్లజోడు- ఎంత బాగున్నావు! ఇరవై ఏళ్ళ యువకుడివి- ఇలా మాట్లాడరాదు. ఏదోఒక విధంగా రైతుకు న్యాయంచేయాల్సిందే" అన్నాడు సమధర్ముడు.

"నేను చిన్నప్పటినుండీ ఏనాడూ పనిచేసింది లేదు. అసలు పని చేయటం అంటేనే నాకు అసహ్యం. కావాలంటే వేరేవాళ్లచేత పని చేయించగలనేమో, చూస్తాను" అన్నాడు రాంకీ.

"సరేలే నాయనా! ఏమైనా చదువుకున్నావా?" అడిగాడు సమధర్ముడు.

"లేదు! ప్రతి పరీక్షా ఒత్తిడితో కూడుకొని ఉంటుంది. అందుకని అవంటే ననాకు అస్సలు ఇష్టం లేదు" అన్నాడు అతను చిరునవ్వు నవ్వుతూ.

వెంటనే ఒకవ్యక్తికి చెవిలో ఏదో చెప్పి బయటికి వెళ్ళాడు సమధర్ముడు.

మరుక్షణం ఇద్దరు ముసుగు వీరులు లోనికి వచ్చి రాంకీని పెడరెక్కలు విరిచి పట్టుకున్నారు. గబగబా అతని కళ్ళకి గంతలు కట్టారు. గబగబా అతన్ని కుళ్ళ బొడుస్తూ "ఒరేయ్, మేం ఇప్పుడు నీనుండి ఐదు లీటర్ల రక్తం తీసుకుంటాంరా! ఇంకొంచెం సేపటికి డాక్టరు గారు రాగానే నీ కిడ్నీ కూడా తీయిస్తాంరా! సోమరి పోతు వెధవా!" అ కుళ్లబొడవ సాగారు.

అప్పటివరకూ చిరునవ్వులు చిందించిన అతను ఇప్పుడు వాళ్ళ కాళ్ళు పట్టుకొని "అయ్యా! వద్దయ్యా! మీరు వేరే ఏ పని చెబితే ఆ పని చేస్తాను! నన్ను కొట్టకండి!" అని ఏడవటం మొదలు పెట్టాడు.

వాళ్ళు అతన్ని కొట్టటం ఆపి "సరే! అయితే ఈ రోజంతా గొడ్లకు కాపలా ఉండు" అని చెప్పి వెళ్ళారు.

వాడు రోజంతా మర్యాదగా తలెత్తకుండా గొడ్లు కాసి, సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్ళాడు.



యమధర్మరాజు అసలు ఇవేం శిక్షలో అర్థం కాలేదు. సమధర్ముడి శిక్షలు సమానంగా ఎక్కడున్నాయి? మొదటి వాడిని ఊరికే పంపించాడు.రెండవ వాడికి చిన్న జరిమానా వేశాడు. మూడవ వానితోనేమో ఊరికి

పనికొచ్చే పని ఏదైనా చేయమని చెప్పి పంపించేశాడు. నాలుగవ వాడికి జీతంతో పని కల్పించాడు. ఇక ఐదవ వాడిని చిదక బాదించి, వాడి చేత గొడ్లు కాయించి పంపాడు! మరి అందరు చేసిన తప్పు పనీ ఒకటే క కదా?! శిక్షల్లో ఇంత భేదం ఉంటే ఎలాగ?

అదే అడిగితే సమధర్ముడు నవ్వి,చెప్పాడు- "అయ్యా! నేరం చేసిన వాడికి శిక్ష అసలు ఎందుకు వెయ్యాలి? అతనిలో మార్పు తేవటం కోసం. అట్లాంటి బాహ్యచర్యలు తెచ్చే మార్పులు అందరిలోనూ ఒకేలా ఉండవు. వారి వారి వ్యక్తిత్వాలను బట్టి శిక్షలు వారిమీద వేరు వేరు ప్రభావాలను చూపుతుంటాయి. కావాలంటే మీరే స్వయంగా వాళ్ల ఇండ్లకు వెళ్ళి చూడండి. మొదటి వాడు నా మాటలకే బాధపడుతూ ఉంటాడు. చివరివాడు ఆ దెబ్బలను కూడా లెక్క చేయకుండా ఉంటాడు. పోయి చూసి రండి, మీకే తెలుస్తుంది" అన్నాడు.

యమధర్మరాజు ఆ ఐదుగురి ఇండ్లకూవెళ్లి చూశాడు. నిజంగానే అంతా సమధర్ముడు చెప్పినట్లుగానే ఉంది: మొదటివాడు ఇంకా బాధ పడుతూనే ఉన్నాడు; చివరివాడు అంతా దులపరించుకొని పోయాడు!

"సమధర్ముడు చెప్పింది నిజం. శిక్షలు వేయాల్సింది వ్యక్తుల్లో మార్పు రావటం కోసం. అట్లా కాక వాళ్ళు మరణించేలాగా చేస్తే, అది కక్ష అవుతుంది తప్ప, శిక్ష కాదు. మనసుని బట్టి శిక్ష ఉండాలి- అంతే" అని యముడు కూడా నిట్టూర్చాడు.

నవ్వు!

మతిమరపు!

డాక్టరు: నీ మతిమరుపుకి నేనిచ్చిన మందులు సరిగ్గా వాడావా?

రోగి: మందుల చీటీ ఎక్కడపెట్టానో గుర్తురావటం లేదు. మళ్ళీ రాయించుకుందామని వచ్చాను సార్!



పనిమంతురాలు

మామ్మగారు చెప్పిన కథ

చెప్పిన మామ్మగారు : పిడూరు సీతమ్మ   సహాయం: రాధ మండువ



చింతపర్తిలో రంగయ్య అనే ఒక షావుకారు ఉండేవాడు. ఆయనకు ఏడుగురు కొడుకులు. కొడుకులు పెద్దవాళ్ళయ్యాక ఒక్కొకరికీ ఒక్కో వ్యాపారాన్ని ఒప్పజెప్పి విశ్రాంతిగా రోజులు గడుపుతున్నాడు. మొదటి ఆరుగురు కొడుకులకీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. ఇక ఏడవ వాడికి కూడా పెళ్ళి చేసేసి, ఏడుగురు కొడుకులూ-కోడళ్ళ చేత షష్టిపూర్తి చేయించుకోవాలని షావుకారుకి కోరిక కలిగింది. వచ్చే ఏడాదికే ఆయనకి అరవై ఏళ్ళు నిండుతాయి. ఏడవ కొడుక్కి కూడా త్వరగా సంబంధాలు తీసుకురమ్మని పెళ్ళిళ్ళ పేరయ్యని తొందరపెట్టసాగాడు ఆయన.

ఆ ఊళ్ళోనే ఉండే మరో షావుకారు తిరుమలయ్యకి ఈ సంగతంతా తెలిసింది పేరయ్య ద్వారా. తిరుమలయ్యకి ఒక్కగానొక్క కూతురు సరోజ. ఒకే కూతురు

కావటంతో ఆ పిల్లని అతి గారాబంగా పెంచాడు రంగయ్య. దాంతో ఆ పిల్లకి ఏ పనీ చేత కాకుండా అయ్యింది.



రంగయ్య కొడుక్కి గనక తన బిడ్డను ఇస్తే, ఆ అమ్మాయి ఉన్న ఊళ్ళోనే, కంటికెదురుగా, కుదురుగా ఉంటుందనుకున్న తిరుమలయ్య పెళ్ళిళ్ళ పేరయ్యకి బాగా డబ్బు ముట్టచెప్పి, 'ఏదో ఒక రకంగా ఈ సంబంధం కుదర్చాల్సిందే' అని నొక్కిచెప్పాడు.

పేరయ్య నేరుగా వచ్చి ఈ సంబంధం సంగతి రంగయ్యతో ప్రస్తావించాడు. వివరాలు వినగానే రంగయ్య భార్య "అయ్యో! ఆ పిల్లకి ఒక్క పని కూడా చేతకాదుటండీ!" అంది. ఊళ్ళో ఆవిడకి తెలీని సమాచారం నిజంగానే ఏమీ లేదు మరి!

"పని చేతకాకపోతే ఏమిలే- చిన్నగా నేర్చుకుంటుంది" అన్నాడు రంగయ్య, షష్టిపూర్తి చేయించుకోవాలనే తొందరలో.

నెల తిరక్కుండానే ఏడో కొడుకుకి సరోజనిచ్చి పెళ్ళి జరిపించి, వెంటనే అత్తవారింటికి కూడా తీసుకొచ్చారు. అత్తగారింట్లో సరోజ ఒక్క పనీ చేయదు. ఎవరైనా ఏదైనా పని చెప్పినా, సగం చేసి సగం వదిలేసేది. లేకపోతే ఒక్కోసారి తికమకగా, ఎంత గందరగోళం చేసేదంటే ఆమె చేసిన పనిని సవరించుకోవటం ఇంకా పెద్ద పని అయ్యేది. ఎప్పుడూ రాణిలాగా బట్ట నలక్కుండా గదిలో కూర్చుని ఉండే సరోజని చూస్తే మిగిలిన తోడికోడళ్లు ఆరుగురికీ కడుపు మంటగా ఉండేది.

షష్టిపూర్తి పండగ దగ్గర పడుతోంది. ఆరుగురు తోడికోడళ్ళూ ఒక చోట చేరి, 'వచ్చిన చుట్టాలందరికీ మనమే ఎందుకు వడ్డించాలి? అందరం పనులు వంతులు వేసుకుందాం' అనుకున్నారు. అత్తగారి

దగ్గరకు చేరారు. విషయాన్ని మెల్లగా ఆమె చెవిన వేశారు. అత్తగారు సరోజను కూడా పిలిచారు-

"ఆ! ఇప్పుడు చెప్పండి. ఎవరు ఏం పనులు చేస్తారో" అంది అత్తగారు.

"నేను విస్తళ్ళు వేస్తా" అంది పెద్ద కోడలు.

"నేను అన్నం వడ్డిస్తా" అంది రెండో ఆమె.

"నేను పిండివంటలు వడ్డిస్తా" అంది మూడో ఆమె.

ఈ విధంగా మిగతా ముగ్గురూ 'కూరా, పప్పూ. పచ్చడీ' అని చెప్పారు.

ఏడో ఆమెకి ఏం చెప్పాలో తెలియలేదు.

"విస్తళ్ళు తీసేయమనండి" అంది పెద్ద తోడికోడలు.

"సరే! నువ్వు విస్తళ్ళు తీసేయమ్మా" అంది అత్త.

సరోజ తల ఊపి తన గదిలోకి వెళ్ళింది.

షష్టిపూర్తి పండగ రోజు రానే వచ్చింది. బంధువులు అంతా వచ్చారు. కార్యక్రమాలన్నీ ముగిశాయి. అందరూ భోజనాలకి కూర్చున్నారు. పెద్దామె విస్తళ్ళు వేసింది. రెండో ఆమె అన్నం వడ్డించింది. మిగతా నలుగురూ వాళ్ళు వాళ్ళు ఒప్పుకున్న పదార్థాలను వడ్డించసాగారు.

అందరూ తిందామనుకునేలోపు ఏడో ఆమె వచ్చింది. విస్తళ్ళన్నీ ఉండచుట్టి తీసేయసాగింది. విస్తళ్ళముందు కూర్చున్న బంధువులందరూ విస్తుపోయారు. కొందరు మొహమాటం కొద్దీ లేచి పోబోయారు. కొందరు విస్తళ్ళు వెనక్కి లాక్కొని గొడవ పెట్టుకోసాగారు.



పనులు పంచుకున్న సంగతి భార్య ద్వారా

వివరంగా విన్న రంగయ్య పాపం షష్టిపూర్తి రోజున తల బాదుకున్నాడు. తోడికోడళ్ళూ, అత్తా ఏడుపు ముఖాలు పెట్టారు. సంగతి తెలుసుకున్న బంధువులు పకపకా నవ్వారు.

వియ్యంకుడు తిరుమలయ్య చాలా బాధ పడ్డాడు. బిడ్డ సరోజను ఇంటికి పిలుచుకెళ్ళాడు. పనులన్నీ నేర్చుకునేంత వరకూ అత్తవారింటికి పంపించేది లేదని గట్టిగా చెప్పాడు. సరోజ కూడా పరిస్థితిని అర్థం చేసుకున్నది. మనసుపెట్టి పనులన్నీ నేర్చుకున్నది. ఇప్పుడు చక్కగా కాపురం చేసుకుంటున్నది!

నవ్వండి!

మ్యాజిక్!

టీచర్: అల్లాఉద్దీన్ అద్భుత దీపం నీ చేతికిస్తే ఏంచేస్తావు?

విద్యార్థి: మీ పీరియడ్‌లో మాయమైపోతా...!

ఎన్ని?!

డాక్టర్: తలనొప్పా? అయితే రెండు మాత్రలు వేసుకో

వెంగళప్ప: రెండెందుకండి, ఒకటి చాలు. నాకున్నది ఒక్కటే తలకాయ...!

అప్పారావు!

శ్యామల: మీ ఆయన ఇంత పెద్ద ఇల్లు కట్టాడు. ఇంతకీ ఏంచేస్తాడు?

విమల: అప్పులు...!

ఎక్కడ?

బిచ్చగాడు: బాబ్బాబు! ధర్మం చేయండి!

సుబ్బారావు: ఏమయ్యా, నడిరోడ్డుపై నిలుచొని అడుక్కోవడానికి నీకు సిగ్గుగాలేదూ?

బిచ్చగాడు: పక్కన నిలుచొని అడిగితే ఎవరూ చూడడం లేదు బాబూ...!



సంగీత పక్షి కథ

మూలం: శ్రీ మహనందప్ప, విశ్రాంత ఉపాధ్యాయులు, మైదుకూరు.
మార్పు చేర్పులు: కొత్తపల్లి

మిథిలా నగరపు మహారాజు నివసించే రాజ మహలుని ఆనుకొని ఉన్న అడవిలో ఓ పక్షి ఉండేది- అది చాలా శ్రావ్యంగా పాటలు పాడేది. రాజమహలును చూసేందుకు వచ్చిన యాత్రికులు పక్షి పాడే పాటలు వినటంకోసం అడవిలోకి కూడా వెళ్తుండేవాళ్ళు.

అయితే రాజుగారు మటుకు దాన్ని ఎప్పుడూ చూడలేదు. అందరూ దాన్ని గురించి చెప్పుకోగా విని విని ఒకసారి ఆయనకు దాన్ని చూడాలని కోరిక కలిగింది. రాజుగారు అనుకుంటే కానిదేమున్నది? భటులను పంపించాడాయన- "పాటలు పాడే పక్షిని వెతికి పట్టుకొని రండి!" అని.

భటులు అడవంతా తిరిగారు. చెట్టూ పుట్టా అంతటా గాలించారు. అడవిలో తిరిగి తిరిగి అలసిపోయారు. కనబడిన వాళ్లనల్లా అడిగారు. చివరికొక పాప చెప్పింది- "నేను చూశాను దాన్ని!" అని. "నా పని ముగించుకొని సాయంత్రం ఇంటికి పోతున్నానా, నిన్న?! అప్పుడు కనిపించిందది. నావెంటే వచ్చింది కూడా. మంచి మంచి పాటలు పాడుతూ నా

అలసటను పోగొట్టింది"

ఇలా చెబుతూ ఆ పాప పక్షిలాగానే చక్కగా పాడింది- "నా బంగారు పక్షీ! మా రాజావారు నీ తియ్యటి పాట వినాలని కోరికగా ఉన్నారు. మరి నువ్వు వారి కోరిక తీర్చరాదా?!" అని పాడింది.

పాప పాట వినగానే ఎక్కడినుండి వచ్చిందో మరి, పాటలు పాడే పక్షి అక్కడికి వచ్చేసింది. "నా పాటలు విని అడవిలోని చెట్లు, జంతువులు అన్నీ తృప్తిగా ఉంటున్నాయి కదా, ఇప్పుడు రాజా వారిని కూడా నా పాటతో సంతోషపెడతాను" అని భటులతోపాటు రాజభవనానికి బయలుదేరింది.

మరునాడు రాజుగారి కొలువులో పక్షి సంగీత కచేరి చేసింది. ఆ గానానికి సభలో ఉన్నవారంతా పరవశించి పోయారు. రాజుగారు ఎంత ముగ్ధులైపోయారంటే, ఆనందంతో ఆయన కళ్ళలో నీరు నిండింది. "ఓయి సంగీతపు పక్షీ! నువ్వు ఇక్కడే మాతో పాటు ఉండిపో! నీ పాట వింటూ నేను రాజ్యపరిపాలనలోని శ్రమనంతా మరచిపోగలను. మా ఆస్థానంలో ఉంటూ నువ్వు ప్రజలందరికీ సంతోషం కలిగించినదానివౌతావు" అన్నారు.



రాజుగారి కళ్లలో కనిపించిన ఆదరానికి పక్షి కరిగిపోయింది. "సరే మహారాజా! మీ సంతోషం కోసం నేను కొన్నాళ్ళు ఇక్కడే ఉంటాను" అన్నది.

మరుసటిరోజుకల్లా రాజుగారు పక్షికోసం బంగారు పంజరాన్నొకదాన్ని తయారు చేయించారు. ఏనాటికానాడు దానికి నచ్చే పండ్లు, కాయలు, గింజలు అన్నీ తెచ్చిపెట్టసాగారు. దాన్ని అపురూపంగా చూసుకోసాగారు.

రాజుగారు ఆదరించే సరికి, సంగీతపు పక్షికి మరింత పేరు వచ్చింది. దాని ఖ్యాతి ఇప్పుడు రాజ్యం నలుమూలలకూ విస్తరించింది. ప్రతిరోజూ రాజుగారు దాని చేత పాటలు పాడించుకొని వినేవాళ్ళు. దాని సంగీతంతో తన శ్రమను మరచిపోయేవాళ్ళు.

ఒకరోజున ఆస్థానానికి రైతులు కొందరు వచ్చారు. సంగీతపు పక్షి పాటను విని వాళ్ళు అందరిలాగా "ఆహా! ఓహో!" అనలేదు. "బాగుంది.. పర్లేదు" అన్నారు. ఆ తర్వాత తమకు ఎదురవుతున్న కష్టాలను వివరించారు రాజుకు.

అప్పుడు సంగీతపు పక్షి రాజుగారితోఅన్నది- "ప్రభూ! తమరు అనుజ్ఞ ఇస్తే నేను వీరివెంట వెళ్లి, మన గ్రామాలన్నీ చుట్టి వస్తాను. ప్రజల కష్ట సుఖాలతో నిమిత్తం లేని సంగీతం సంగీతం కాదు కదా! వారి జీవితాలను గమనించిరావటం వల్ల నా సంగీతం మరింత సుసంపన్నం అవుతుందని నా నమ్మకం" అని.

రాజుగారు అనుమతించారు. పక్షి దేశ సంచారం మొదలు పెట్టింది. దేశంలోని శ్రమజీవుల జీవితాలను నేరుగా గమనించింది. ప్రజల జీవితాలకు, ప్రభువుల జీవితాలకు అసలు పొంతన లేదు. ప్రజల కష్టాలు వేరు; ప్రభువుల కష్టాలు వేరు. ప్రజల బ్రతుకులను చూస్తున్న పక్షి కాల గమనాన్ని మరచిపోయింది. వెనక్కి వెళ్ళాలన్న సంగతే గుర్తు రాలేదు దానికి.



అయితే అక్కడ, రాజుగారు సంగీతపు పక్షి కోసం కలవరించటం మొదలుపెట్టారు. దానిపై బెంగతో ఆయన ఆరోగ్యం క్షీణించసాగింది. క్రమంగా ఆయన మంచం పట్టారు. ఆయన పరివారం అంతా ఆందోళన చెందసాగింది.

గ్రామాల్లో తిరుగుతున్న పక్షికి ఆ సంగతి తెలిసే సరికి చాలా సమయం పట్టింది. వార్త అందిన మరుక్షణం అది బయలుదేరి వచ్చింది రాజుగారి దగ్గరికి. మంచం మీద ఉన్న రాజుగారు దాన్ని చూసి చిరునవ్వు నవ్వారు. ఆయన ప్రక్కనే చేరిన పక్షి పాట మొదలు పెట్టింది. విషాదాన్నీ, ఆశనూ ప్రతిఫలించే ఆ పాటని అది ఎంత అద్భుతంగా పాడిందంటే, దాన్ని విన్నవాళ్లంతా పరవశించి పోయారు. మరునాటికల్లా రాజుగారి ఆరోగ్యం కుదురుకున్నది.

ఆయన అన్నారు పక్షితో- "ఓ సంగీతపక్షీ! నీ గానం అలౌకికం! నీ పాట అద్భుతం. మధురమైన నీ గానం నుండి నన్ను ఇక ఏనాటికీ దూరం చెయ్యనని మాట ఇవ్వు" అని.

పక్షి ఏమీ మాట్లాడలేదు.

"నీ పాటలో ఇప్పుడు ఇదివరకటికంటే ఎక్కువ భావం వినవస్తున్నది. మిత్రమా, ఇంతకూ నీ గానానికి ఇంత బలం ఎక్కడినుండి వచ్చిందో! ఏ బ్రహ్మ నీ పాటకు ఇంత జీవాన్నిస్తున్నాడో! నువ్వే చెప్పాలి, ఊరికే ఉంటే కుదరదు" అన్నారు రాజుగారు.



పక్షి అన్నది- "ప్రభూ! మీ దగ్గరనుండి వెళ్ళాక సాధారణ పౌరులను చాలామందిని కలిశాను. ప్రజల జీవితాలను దగ్గరగా చూడగల్గాను. నా సంగీతంలోకి అలా జీవం ప్రవేశించింది. అంతకు ముందు నేను పాడిన పాట అందమైనదే- కానీ దానిలో ప్రాణం లేదు. ప్రజల జీవితాలకు దూరమైన సంగీతం నిజంగానే సంగీతం కాదు అని నాకు

అర్థమైంది. ఇప్పుడు మీరు ఆజ్ఞాపించినట్లు నేను మీదగ్గరే ఉండిపోతానేమో; కానీ కాలం గడిచేకొద్దీ నా సంగీతంలో జీవం తగ్గిపోతుందేమో అని, సంకోచిస్తున్నాను" అని.

రాజుగారు స్వతహాగా మంచివాడు. పక్షి మాటలలోని అర్థం ఆయన్ని ఆలోచింపజేసింది. కొంతసేపు మౌనంగా ఉండి, ఆయన ఒక నిశ్చయానికి వచ్చారు. ఆ తర్వాత అన్నారు చిరునవ్వు నవ్వుతూ- "మరైతే నువ్వు మళ్ళీ రాజ్య సంచారానికి పోవచ్చు. కానీ కనీసం నెలకొకసారి నాకు కనబడాలి. ఆనెలరోజుల్లోనూ నువ్వు నేర్చుకున్న పాటలు నాకూ నేర్పాలి. నా పాలనకూడా సజీవం కావాలిగా, మరి?!" అని.

పక్షి సంతోషంగా తలూపింది. అటుపైన అది ప్రతినెలా తిరిగివచ్చి రాజుగారికి ఒక క్రొత్త పాటను నేర్పింది. ప్రతి పాటలోనూ తను చూసిన ప్రజల జీవితాలను ప్రతిబింబింపజేసిందది. ఆ సంగీతం వల్ల రాజుగారి పాలన నిజంగానే మానవీయం అయ్యింది!


ఒకప్పుడు మన దేశంలో గ్రంథాలయాల వ్యవస్థ చాలా బాగుండేది. ప్రతి బడిలోనూ ఒక గ్రంథాలయం ఉండేది, దానిలో పుస్తకాలు ఉండేవి! ఆ పుస్తకాలను చదువుకునేందుకు ప్రత్యేకించి వారానికి రెండు తరగతులు కూడా ఉండేవి. పుస్తకాలను పిల్లలు ఇంటికి కూడా తీసుకెళ్ళి, చదివి, వెనక్కి తెచ్చి ఇచ్చే వీలుండేది! మనందరం తలచుకుంటే అలా చేయటం ఇప్పుడూ ఏమంత కష్టం కాదు.... తలచుకుందామా, మరి?!

* మన ఇళ్లలోని పుస్తకాలను గ్రంథాలయాలకు ఇద్దాం! * గ్రంథాలయాలకు బీరువాలు, పుస్తకాలు కొని పెడదాం! * గ్రంథాలయాలకు సమయాన్ని కేటాయిద్దాం!

గియోర్గియో గ్రాం!

యువ కెరటాలు

నిర్వహణ: సౌమ్య, పుస్తకం డాట్ నెట్



ఈమధ్యకాలంలో ఇంటర్నెట్ పుణ్యమా అని ఎందరో యువ రచయితల గురించి తెలుస్తోంది. వాళ్ళంతా ఒక పక్క తమ చదువులు కొనసాగిస్తూనే తీరికవేళల్లో గొప్ప గొప్ప రచనలు చేసేస్తున్నారు! మరి కొత్తపల్లి పత్రికలో రాసే బాల రచయితలకు, కొత్తపల్లి కథలు చదివే పాఠకులకూ కూడా వాళ్ళ గాథలు ప్రోత్సాహకరంగా అనిపిస్తాయని తోచింది. అలాంటి ఒక యువ రచయిత గురించే ఈవ్యాసం.

ఈ రచయిత పేరు 'గియోర్గియో గ్రాం'! పేరు చూస్తే ఎవరో విదేశీయుడిలా ఉంది కదా? కానీ కాదు. ఇరవై ఏళ్ళ ఈ ఇంజనీరింగ్ స్టూడెంట్ అసలు పేరు **జార్జి మనవళన్**. కోయంబత్తూరులో ఇంజనీరింగ్ విద్యార్థి. స్వస్థలమేమో కేరళలోని కొచ్చి నగరం. ఇతనికి చిన్నప్పటి నుండి పాశ్చాత్య పురాణ గాథలపై ఆసక్తి ఉండేదట. 'పురాణ పాత్రలతో సాంకేతికతని జోడించి ఒక కథ అల్లితే ఎలా ఉంటుంది?' అనుకున్నాడట. తీరిక వేళల్లో సరదాగా ఒక నవల రాయడం మొదలుపెట్టాడట; చూడగా ఆ కథ బలే ఉందనిపించింది. వెంటనే దాన్ని ఒక వెబ్సైటు ద్వారా ప్రచురించాడు. అప్పుడే అంతర్జాతీయంగా దాన్ని మార్కెట్ చేయాలనుకుని, ఆ కలంపేరును వాడుకున్నాడు!

అతను రాసిన ఆ నవల పేరు 'Soldier of Ares'

"ట్రోజన్ వార్" అనేది పాతకాలపు ఓ గొప్ప ఆంగ్ల గ్రంథం. ఆ ట్రోజన్ వార్ కి కొనసాగింపుగా రాసిన కాల్పనిక నవలట ఇది! హోమర్ లాంటి ప్రసిద్ధ ఆంగ్ల రచయిత రాసిన గ్రంథానికి ఇరవై ఏళ్ళ అబ్బాయి కొనసాగింపు రాయడం అంటే అసలు సామాన్య విషయం కాదు. ఈ కథ రాయడానికి

జార్జికి ఒక సంవత్సరం పట్టిందట. ఈ కథను అల్లడానికి తాను చాలా కష్టపడ్డాననీ, విపరీతంగా పుస్తకాలు చదివాననీ చెబుతాడు జార్జి.

అలాగే, ఒక పక్క క్లాసులకి వెళ్తూ, ఒక పక్క సాయంత్రాలు నవల రాయడం కూడా అంత సులభమైన పనేమీ కాదు. ఈ విషయంలో అతను పడ్డ శ్రమకి తగ్గ ఫలితమే దక్కింది. పుస్తకం అంతర్జాతీయంగా విడుదలైంది. తల్లిదండ్రులు, కాలేజీ యాజమాన్యం - అందరూ జార్జిని గురించి సంతోషం వ్యక్తపరచారు. ఇటీవలే "ది హిందూ" పత్రికలో జార్జి గురించి ఒక వ్యాసం కూడా వచ్చింది.

మూడు నవలల సిరీస్ రాయాలనుకుంటున్నాడు జార్జి. వీలైతే తన చదువు పూర్తైన తరువాత 'రచనా వ్యాసంగం కొనసాగించాలి' అనికూడా అనుకుంటున్నాడట. మన చుట్టూ జరిగే విషయాల గురించి, భారతీయ పురాణాలలోని పాత్రల గురించి, రోజూ నేర్చుకుంటున్న కొత్త విషయాల గురించి - మీరూ కొత్త కొత్త కథలెన్నో రాయచ్చు. మీ సృజనాత్మకతకు పదును పెట్టండి, మరి!

జోకుల పెట్టె

నిర్వహణ: శ్రీ వివియస్ మూర్తి, చొదిమెళ్ల, పశ్చిమ గోదావరి జిల్లా

జ్ఞానం!

రాము: ఒరే, మనం ఇవాళ్ళ ఉపవాసం చేస్తోంది ఏ దేవుడికోసం రా?

సోము: ఇవాళ్ల మనం చేస్తున్నదాన్ని ఉపవాసం అనరురా, నిరాహార దీక్ష అంటారు!

తెలివి ఎక్కువైంది!

టీచరు: రామూ! స్పెల్లింగులు సరి చూసుకోమంటే వినవేమిరా?

నిన్ను గ్లోబల్ వార్మింగ్ అని రాయమంటే గ్లోబల్ వార్నింగ్ అని రాశావు!

అతితెలివి రాము: రెండూ ఒకటేలెండి సార్! గ్లోబల్ వార్మింగు మనందరికీ వార్నింగేగా?

వాస్తు పక్షులు!

వాస్తు సిద్ధాంతి: ఏమేవ్! మనం ఈ క్రొత్త ఇంటికి మారినప్పటినుండీ నీ వంట ఇట్లా ఉంటోందేంటే, మరీ ఇంత చప్పగానా?

వాస్తుగారి భార్య: మరి వంటింటి వాస్తు సరిగాలేదంటే వినిపించుకోనే లేదు గదండీ!

అచ్చు తప్పు!

రెడ్డి: ఒరేయ్! మా హోటలుకు ఎందుకనో, ఎవరూ రావట్లేదురా!

స్నేహితుడు: కూల్‌డ్రింక్ దుకాణాల బ్యానర్లు రాసే ఆర్టిస్టుతో హోటలు బ్యానర్ రాయించద్దంటే విన్నావా?

రెడ్డి: ఇప్పుడేమైందిరా?

స్నేహితుడు: బోర్డు మీద ఏం రాశాడో చూడు "ఇచ్చట చల్లటి కాఫీ, చల్లటి టీ లభించును!"- ఇంకెవరు వస్తారు మీ హోటలుకు?!

ఎవరు కదులుతారు?

టీచరు: రామూ నువ్వు పుస్తకాలు చదువుతావు, టీవీ చూస్తావు. మరి

పుస్తకానికి, టీవీకీ తేడా ఏంటో చెప్పు, చూద్దాం?!

రాము (కొంచెం ఆలోచించి): పుస్తకం మన దగ్గరికి వస్తుంది టీచర్, మరైతే మనం టివి దగ్గరికి వెళ్తాం!

అత్యాశ!

సుబ్బారావు: ఒరే అప్పారావూ! నీది మరీ అత్యాశరా!

అప్పారావు: ఇప్పుడేమైందిరా?!

సుబ్బారావు: టికెట్లు కొనకుండానే లాటరీ రావాలని ఆశపడుతున్నావు కదరా!!

బెదిరింపు!

కూల్‌డ్రింక్ దుకాణం ఓనర్: రంగా! నిన్ను డిస్మిస్ చేస్తున్నాను. రేపటినుండి పనిలోకి రాకు!

రంగ: ఆలోచించుకోండి సార్! తర్వాత 'ముందు చెప్పలేదు' అనకూడదు. రేపు పొద్దుటికల్లా మన దుకాణం ఎదురుగా చలివేంద్రం పెడతాను మరి!

దోమ తెలివి!

సోము: ఎవరి చెంపమీద వాళ్ళు ఎప్పుడు కొట్టుకుంటారు టీచర్?

టీచరు: తెలీదురా, అంత తెలివి తక్కువ వాళ్ళు ఎవరూ ఉండరనుకుంటాను ఈ ప్రపంచంలో.

సోము: మరి నిన్న మీ చెంపను దోమ కుడుతున్నప్పుడు- మీ చెంపను మీరే కొట్టుకున్నారు కద టీచర్?

అధిభౌతికం!

మిత్రుడు: మీ పిల్లవాడికి అక్షరాభ్యాసం రోజున ఏదో కొత్తగా రాయించావటనే? ఏమని?

భౌతికరావు: కోటి విద్యలు కూటి కొరకే అని రాయించా.

ఎవరి తప్పు?!

తండ్రి: ఒరేయ్ చిన్నా, ఎప్పుడూ సెల్ ఫోన్ తోటే ఆడుతుంటావెందుకురా?

చిన్నా: మరి నేను పుట్టినప్పుడు నాకోసం నువ్వు సెల్ ఫోనే కద నాన్నా, తెచ్చింది?!

చిన్న మార్పు!

జర్నలిస్టు: టెన్నిస్ ప్లేయర్ గారూ, మీరు ఎక్కడికి వెళ్దామనుకొని ఎక్కడికి చేరుకున్నారు?

టెన్నిస్ ప్లేయర్: నేను రాకెట్టు మీద అంగారకుడి దగ్గరికి వెళ్ళాలనుకున్నా, కానీ ఇప్పుడు రాకెట్టుతో టెన్నిస్ ఆడుతున్నా!

శుభ్రత!

టీచర్: రాముూ! పరీక్షపేపర్లో జవాబులు రాయకుండా తెల్ల కాగితం ఇచ్చావెందుకు?

రాము: శుభ్రతకు పది మార్కులు వేస్తానని మీరే కద టీచర్, అన్నారు?

నేస్తాలు

ఈ చక్కని పాట కొత్తపల్లిలో 2008 జులైలో వచ్చింది. (http://kottapalli.in/2008/07/నేస్తాలు)
అయినా దీన్ని గుర్తు చేసి మంచి పని చేసింది కదా, స్నేహిత...?
సేకరణ: స్నేహిత, నాలుగవ తరగతి, వికాస విద్యావనం, పోరంకి, కృష్ణాజిల్లా



మంచి మార్గం చూపేవారు
కష్టాల్లో కాపాడేవారు
ప్రేమతో నన్ను పిలిచేవారు
నేస్తాలు! నా నేస్తాలు!!

ఆట పాటలలో అలగనివారు
కమ్మని కబుర్లు చెప్పేవారు
కలకాలం కలిసుండేవారు
నేస్తాలు! నా నేస్తాలు!!

హెచ్చు తగ్గులు ఎంచనివారు
సమతా మమతా పంచేవారు
సౌజన్యాన్ని పెంచేవారు
ఎల్లవేళలా కాచేవారు
నేస్తాలు! నా నేస్తాలు!!

కుసుమా కుసుమా

చిట్టిపాట
పాడిన చిన్నారి: యస్.పూజిత, ఐదేళ్ళు.

కుసుమా కుసుమా
ఎండలో కూర్చున్నావ్?!
లెయ్ లెయ్ పాపా
కంటినీళ్ళు తుడుచుకో
ఎవరు కావాలో కోరుకో ।



మీకు ఈ పుస్తకం నచ్చిందా? మరైతే దీన్ని వృధా పోనివ్వకండి. మీదగ్గరున్న పుస్తకాలను మీ స్నేహితులతో తప్పకుండా పంచుకోండి. 'పుస్తకాలు పంచుకోవటం' బలే బాగుంటుంది! దానివల్ల అందరికీ లాభమే మరి!

మంచి పుస్తకం:

గలివర్ యాత్రలు

మూలం: జోనాథన్ స్విఫ్ట్ అనువాదం: ముసునూరు శివరామకృష్ణారావు

కుర్ర డాక్టరు గలివర్‌కి సంపాదన సరిగా లేదు. ఓడల్లో డాక్టరుగా వెళ్తే డబ్బులు బాగా వస్తాయని తెలిసింది. అయితే ఆ రోజుల్లో ఓడ ప్రయాణాలు ప్రమాదమే, మరి. అయినా తప్పదు- మొదటి యాత్ర మొదలయింది. అనుకున్నట్లే తుపానులో ఇరుక్కున్నది పడవ. ఓ రాతిని కొట్టుకొని ముక్కలు ముక్కలైపోయింది. వేరే ఎవరికీ తెలీని ఓ అద్భుత ద్వీపం చేరుకున్నాడు గలివర్. అక్కడ ఉన్నది మిరపకాయంత మనుషులు.. లిల్లీపుట్లు!

గలివర్-లిల్లీపుట్ల కథని ఇప్పటికే చాలా మంది, చాలా రకాలుగా చెప్పేశారు. అవన్నీ చదివేసిన పెద్ద పిల్లలకు, "గలివర్ సాహసయాత్రలు అన్నీ చదువుదాం", "అసలు జోనాథన్ స్విఫ్ట్ రాసిన కథ ఎలా ఉంది?" అనిపించక మానదు. అట్లాంటప్పుడు నచ్చుతుంది వాళ్ళకు, ఈ పుస్తకం.


మొదటిసారి చదివేందుకు ఇది ఏమంత సరళంగా లేదుగానీ, గలివర్ యాత్రల్ని అన్నిటినీ ఒక దగ్గర చదవటం, మూలానికి దగ్గరగా ఉన్న అనువాదాన్ని చదవటం బాగుంది.

సాహసాలను, అద్భుతాలను, ఉత్కంఠను ఇష్టపడే పెద్ద పిల్లలకు ఇదొక మంచి మేత! చాలా రోజుల పాటు ఆపి ఆపి చదువుకుంటే బలే ఉంటుంది!

పీకాక్ వారి ప్రచురణ. మంచి కాగితం, చక్కని ముద్రణ.

కానీ బొమ్మలు లేకపోవటం మాత్రం పిల్లలకు పెద్ద వెలితే.

నిజంగా చదవాల్సిన క్లాసిక్ ఇది!



గలివర్ యాత్రలు
పీకాక్ క్లాసిక్స్,
పేజీలు 164,
వెల: 75రూ.
వివరాలకు:
9849940791

పిల్లల్లో సృజనాత్మకత సహజం. కథలు, ఆటలు, పాటలు, బొమ్మలు దానికి ఊతాన్నిస్తాయి. మాతృభాషలో ఇష్టంగా చదవటం, తేలికగా రాయటం వస్తే అటుపైన అన్ని శాస్త్రాలూ సులభంగా వంటపట్టుతాయి-నిజం! అందుకని మీ పిల్లల్లో ఉన్న కాల్పనిక శక్తికి పదును పెట్టండి. వాళ్లను కథలు రాసేందుకు, పాటలు పాడేందుకు, బొమ్మలు వేసేందుకు ప్రోత్సహించండి. వాళ్ళ రచనల్ని మాకు పంపండి. కావాలనిపిస్తే మీరే ఇలాంటి పత్రికనొకదాన్ని మొదలు పెట్టండి- ఎలాగైనా సరే- పిల్లలు పెద్దవాళ్లయ్యేలోగా వాళ్ళు చాలా చాలా తెలుగు కథల్ని చదివేలా, రాసేలా చేయండి. మీ పిల్లలకు ఈ పత్రికలోని కథలు నచ్చుతాయనే మా నమ్మకం- వీటిని వీలైనంత మందితో పంచుకోండి. మీరు రాసిన పిల్లల కథలు ఏమైనా ఉంటే పనిగట్టుకునైనా సరే, మాకు పంపండి. వీలు చేసుకొని ప్రచురిస్తాం.

నిలకడ

"మా వాడికి బొత్తిగా నిలకడ లేదండీ" చెప్పాడు సుబ్బారావు.

"అంటే ఎప్పుడూ ఎగురుతూ ఉంటాడా?" అడిగాను.

"అవునండీ, కాలు ఒక చోట నిలవదు".

"మరి నోరు?" అడిగా.

"అయ్యో! ఆ నోటి గురించి ఏం చెప్పాలి? బడ బడ వాగుతూనే ఉంటుందెప్పుడూ" అన్నాడు.

"ఓహో! మరైతే ఆకలి బాగానే ఉండి ఉంటుంది" అన్నా.

"అమ్మో! మామూలు ఆకలి కాదు. ఎప్పుడూ ఏదో ఒకటి కరకరా నముల్తూనే ఉంటాడు".

"మరి ఆటలు?"

"ఒకటే ఆడతాడు! ఒకసారి దాగుడు మూతలు, ఒకసారి గోలీలు, ఒకసారి కోతికొమ్మచ్చి, ఓసారి ఇంకేదో, ఓసారి ఇంకేదో. ఆడుతూ ఉండమంటే రోజంతా ఆడతాడు" అన్నాడు సుబ్బారావు.

"ఏమైనా వస్తువులు తయారు చేస్తాడా? రిపేర్లు వగైరాలు?"

"బాగా కనుక్కున్నారు సార్! ఎప్పుడూ ఏదో ఒకటి రిపేరు చేస్తూనే ఉంటాడు. కొత్తగా రోబాట్ బొమ్మ కొనిపెడితే రాత్రికల్లా దాన్ని విరిచి ముక్కలు చేసిపెట్టాడు- లోపల వెలిగే బల్బు ఎలా వెలుగుతుందో చూడాలట!"

"మరి మీ బండి స్పీకర్లనీ వదిలిపెట్టి ఉండడు!" అన్నాను నేను.

"నిజంగానే వదల్లేదు మాస్టారూ! దాన్లో ఎక్కడో ఓ మంచి అయస్కాంతం ఉంటుందట. దాన్ని ఇసకలో దొర్లిస్తే చాలా ఇనప రజను వస్తుందట. ఇనప రజనును అట్టమీద పోసి, క్రింద అయస్కాంతాన్ని కదిలిస్తే చాలట- మహాభారత యుద్ధం కళ్ళముందు కనబడుతుందట!"

"ఓహో, మీవాడికి మహాభారత యుద్ధం కూడా తెలుసా?" అడిగాను నేను ముచ్చటపడుతూ.

"అయ్యో, వాడికి ఉన్నంత కథల పిచ్చి మాకు కూడా ఉండదండీ. ఎప్పుడూ 'కథలు-కథలు' అని వేధించుకు తింటాడు. అప్పటికీ వాళ్ళ అవ్వ ఏవేవో కథలు చెబుతూనే ఉంటుంది. మీకు వాడి గురించి అన్నీ తెలిసినట్లే ఉంది- మా వాడికి కొంచెం మంచి బుద్ధులు ఎలా వస్తాయో చెప్పండి కాస్త! ఏమైనా ధ్యానం నేర్పించమంటారా?"

"వాడికేముందిగానీ, ముందు మీకో మాట చెబుతాను-" అన్నాను.

"చెప్పండి"

"ఏం లేదు, మీవాడిని గురించి చింత పడటం మానెయ్యండి. వాడు చాలా చక్కగా ఎదుగుతున్నాడు- ఇప్పుడే ఏమాత్రం నిలకడ తెప్పించకండి వాడికి. ఇంకొంతకాలం ఇట్లాగే సంతోషంగా ఉండనివ్వండి, పర్లేదు!"

Published by NarayanaSarma for Kottapalli Prachuranalu,1-127/A, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP.
Ph: 7702877670 mail: team@kottapalli.in and printed at Mudrica Offcet Printers, Vijayawada,Phone:08662579129